
బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం, 01 మే-2026 balagamtv100@gmail.com పేజీలు-8


## సలహాదారుగా విహెచ్ నియామకం



హైదరాబాద్, ఏప్రిల్ 30 : తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హను మంతరావును రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమించింది. క్యాబినెట్ హోదా కల్పించి, వీహెచ్‌ను సలహాదారుగా నియ మిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు డీజీపీగా పదవీ విరమణ చేసిన బత్తులశివధర్‌రెడ్డిని ప్రభుత్వం రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియమించింది.

## తెలుగు రాష్ట్రాలకు చల్లటి కబురు





- తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం

హైదరాబాద్/అమరావతి,ఏప్రిల్30 : తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్న నేపథ్యంలో వాతా వరణ శాఖ ఉపశమనం కలిగించే వార్త చెప్పింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలం గాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని.. ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అమరావతి వాతావరణ కేంద్రం ప్రకారం.. దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ద్రోణి విస్తరించి ఉంది. ఫలితంగా.. ఏపీలోని దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో మూడు రోజుల పాటు అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది. గురువారం తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా పిడుగులతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల వివరాలు 3లో..

## నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు



- రూపాయి విలువ 95.07కు చేరిక

న్యూఢిల్లీ,ఏప్రిల్30 : దేశీయ మార్కెట్లు గురువారం భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఇరాన్ ఓడరే వులపై అమెరికా దిగ్బంధనం కొనసాగుతుండటంతో చమురు ధరలు భగ్గుమం టున్నాయి. దాంతో మన సూచీలపై బేర్ పట్టు బిగించింది. దాంతో ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్ల వరకు నష్టపో యింది. ఉదయం సెన్సెక్స్ 868 పాయింట్లు పతనమై, 76,623 వద్ద ట్రేడవుతోంది. నిఫ్టీ 278 పాయింట్లు వివరాలు 3లో..

# సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

- విద్యార్థులకు సకాలంలో పాఠ్య సామగ్రి అందాలి
- వస్తువుల నాణ్యత విషయంలో రాజీపడొద్దు
- ప్రతి విద్యార్థి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలి
- సంక్షేమ శాఖలపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్ 30 : విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతా రని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనా రిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై ముఖ్యమంత్రి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వ హించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెం ట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని... వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతం లో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేద న్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు. సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగు తుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని... సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెటటెలు, ప్లేట్లు, వివరాలు 3లో..

## శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

- కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నాం
- మేడు శు భాకాంక్షలు తెలిపిన సిఎం రేవంత్



హైదరాబాద్,ఏప్రిల్30: మే డే సందర్భంగా రాష్ట్ర ముఖ్య మంత్రి ఏ.రేవంత్ రెడ్డి కార్మిక వర్గానికి ప్రత్యేకంగా అంత ర్జాతీయ కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వ పాలనలో కార్మిక వర్గ స్ఫూర్తితో ముందుకు వెళుతున్నట్టు పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. శ్రామికులే తమ ప్రభుత్వ అభివృద్ధిలో అసలైన భాగస్వాములని... రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే నూతన పారిశ్రామిక విధానం శ్రామికుల అభ్యున్నతికి దోహదపడుతుందని చెప్పారు. కార్మికుల శ్రేయస్సు, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. మే డే స్ఫూర్తితో రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ అభివృద్ధి వివరాలు 3లో..

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



న్యూఢిల్లీ,ఏప్రిల్30 : అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం, డాలర్ బలపడడం వంటి కారణా లతో బంగారం ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వెళ్లిన బంగా రం ధరలు ప్రస్తుతం తగ్గుతుండడంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభిస్తోంది. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం, గురువారం ఉదయం 6.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,430గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,37,890గా ఉంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,50,580గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,38,040గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదల నమోదు చేశాయి. కిలోకు వంద రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2,64,900గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,54,900గా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.రూ.2,64,900గా, బెంగళూరులో రూ.రూ.2,54,900 ఉంది.

## కొత్త ఆయుధంతో విరుచుకు పడతాం



అమెరికాకు ఇరాన్ నేవీ కమాండర్ హెచ్చరిక

టెహ్రాన్,ఏప్రిల్30 : అమెరికా- ఇరాన్ మధ్య ఉద్రిక్త తలు రోజురోజుకీ తీవ్రమవుతోన్నాయి. ఈ క్రమంలో ఇరాన్ నేవీ కమాండర్ రేర్ అడ్మిరల్ షారమ్ ఇరానీ కీలక వ్యాఖ్యలు చేశారు. శత్రు బలగాలపై త్వరలోనే కొత్త ఆయుధంతో విరుచుకుపడనున్నట్లు తెలిపారు. ఆ ఆయుధం అమెరికాను తీవ్రంగా భయ పెడు తుందని హెచ్చరించారు. దిగ్బంధనాన్ని ఎత్తివేస్తేనే.. హర్మూజ్ ను తెరుస్తామంటూ ఇరాన్ చేసిన ప్రతిపా దనలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ (ఆనీనిజీటె ఃసబీఫు) తిరస్కరించారు. ఈ క్రమంలో ఇరాన్ నుంచి తాజా హెచ్చరికలు వచ్చాయి. 'అతిత్వరలో శత్రు బలగాలపై కొత్త ఆయుధాన్ని ప్రయోగిస్తాం. అది వారిని తీవ్రంగా భయపెట్టనుంది. అది వారి పక్కనే ఉంది. దానితో వారికి గుండెపోటు కూడా రావొచ్చు' అని షారమ్ ఇరానీ పేర్కొన్నారు. అయితే, ఆ ఆయుధం ఏంటి అనే విషయాన్ని మాత్రం ఆయన స్పష్టంగా వెల్లడించలేదు. హర్మూజ్ ను దిగ్బంధించి.. ఇరాన్‌ను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేసి, చర్చలకు తీసుకురావాలనే అమెరికా వ్యూహాన్ని వివరాలు 3లో..

## యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

- ఫ్రెండ్లీ పోలీసింగ్ ప్రస్తుతం అత్యావశ్యకం
- వీడ్కోలు సన్మానంలో డిజిపి శివధర్ రెడ్డి
- కొత్త డిజిపి సివి ఆనంద్‌కు అభినందనలు



హైదరాబాద్,ఏప్రిల్30 : రాష్ట్ర డీజీపీ బి. శివధర్‌రెడ్డికి తెలంగాణ పోలీస్ అకాడమీలో ఘనమైన వీడ్కోలు లభించింది. గురువారం ఆయన రిటైర్డ్ అవుతున్న సందర్భంగా పోలీ స్ అధికారులు ఆయనకు గౌరవ వం దనం సమర్పించారు. ఈ సందర్భంగా శివధర్ రెడ్డి మాట్లాడుతూ..32 ఏళ్ల సుదీర్ఘకాలంలో ఎ న్నో అనుభవాలు, అనుభూతులు మిగిలా య న్నారు. వృత్తిలో భాగంగా పలు సంస్క రణలు తీసుకొచ్చామన్నారు. వివరాలు 3లో..

## బెంగాల్లో విజయం మువ్మాటికీ టిఎంసిదే

- కేంద్రం అధికార దుర్వినియోగం చేసినా ప్రజలు మావెంటే
- వీడియో సందేశం విడుదల చేసిన మమతా బెనర్జీ



వివరాలు 2లో..

## మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు

మంగ్లీ సోదరుడి అకౌంట్‌కు డబ్బులు

నిందితుడు రమావత్ మధు ట్రాన్స్‌ఫర్

బ్యాంకర్లను వివరాలు కోరిన పోలీసులు



హైదరాబాద్,ఏప్రిల్30 : తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టి స్తోన్న మైక్రో ఫైనాన్స్ స్కా మ్ కేసు కీలక మలుపు తిరి గింది. సింగర్ మంగ్లీ సోద రుడు శివ చౌహాన్ అకౌంట్‌కు నిందితుడు రమావత్ మధు నగదు పంపినట్లు పోలీసులు గుర్తించారు. కేసు విచారణలో భాగంగా రమావత్ మధు అకౌంట్‌ను పరిశీలించగా.. మంగ్లీ సోదరుడు శివ చౌహాన్ అకౌంట్‌కు డబ్బులు పంపినట్లు తేలింది. మూడుసార్లు నగదు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బులు వివరాలు 3లో..

## 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

ఉస్మానియా వైద్యులకు మంత్రి దామోదర అభినందన



హైదరాబాద్,ఏప్రిల్30 : ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో అరుదైన లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగింది. గ్లైకోజెన్ స్టోరేజ్ సమస్యతో బాధ పడుతున్న 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్‌ను ఉస్మానియా వైద్యులు విజయవం తంగా పూర్తి చేశారు. 10 కిలోల బరువున్న బాబుకి లివర్ వివరాలు 3లో..

## ఎరుగుతున్న ఎండల తీవ్రత

- భారీగా పెరిగిన విద్యుత్ డిమాండ్
- అధికారులతో సమీక్షించిన డిప్యూటి సిఎం భట్టి
- కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తరాదని ఆదేశం



హైదరాబాద్, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో ఎండల తీవ్రత దృష్ట్యా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకుని, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరా యంగా కరెంట్ సరఫరా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండ్ నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజాభవన్‌లో విద్యుత్ సరఫరా పై ఇంధన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో భానుడి భగభగలకు తోడు ఇళ్లు, కార్యాలయాల్లో ఏసీలు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగిందని అధికారులు మంత్రికి వివరించారు. దీనికి వ్యవసాయ అవసరాలు కూడా తోడవడంతో గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగు తోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా విద్యుత్ మార్కెట్‌పై ఒత్తిడి ఉన్నప్ప టికీ, రాష్ట్ర అవసరాలకు ఏమాత్రం లోటు రాకుండా పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్ కొనుగోళ్లు చేపట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆసుపత్రులు, తాగు నీటి సరఫరా పథకాలు మరియు అత్యవసర సేవలకు విద్యుత్ అంతరాయం కలగకుండా నిరం తర పర్యవేక్షణ చేయాలన్నారు. రాష్ట్రంలో వివరాలు 3లో..

## అక్రిడేషన్ కార్డులను అందచేసిన పొంగులేటి

అర్హులందరికీ అందచేస్తామని ప్రకటన



హైదరాబాద్, ఏప్రిల్ 30 : జర్నలిస్టులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న కొత్త అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఎట్టకేలకు ప్రారంభమైంది. గురువారం హైదరాబాద్ హిమా యత్ నగర్‌లోని స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జర్నలిస్టులకు ఈ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని, ఇందులో ప్రభుత్వానికి ఎలాంటి రెండో ఆలో చన లేదని స్పష్టం చేశారు. ఒకవేళ కార్డు పొందిన తర్వాత ఎవరైనా సంస్థ మారితే, ఆ సమాచారాన్ని అధికారులకు తెలియజేస్తే వారి కార్డులను తొలగించబోమని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో అక్రిడిటేషన్ల సంఖ్య 32 వేల నుండి 35 వేల మధ్య ఉండేదని, తమ ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జీవోల వల్ల సుమారు 46 వేల మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి కార్డుల్లో 2500 మందికి క్లియరెన్స్ ఇచ్చామని, జిల్లా స్థాయి కార్డుల మంజూరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. రాబోయే 15 రోజుల్లో అర్హులం దరికీ కార్డుల మంజూరు పూర్తి చేస్తామని మంత్రి ప్రకటిం చారు. కొత్త దరఖాస్తులకు ఒక గడువు నిర్ణయించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఖచ్చితమైన సంఖ్య తెలిస్తే, దాని ఆధారంగా జర్నలిస్టుల కోసం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. పాత కార్డుల గడువు ముగియడంతో, యుద్ధ ప్రాతిపదికన కొత్త కార్డుల జారీని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

balagamtv100@gmail.com

# చిన్నపాటి మందలింపుకే ఆత్మహత్య

## మృత్యువుతో పోరాడుతూ బాలిక మృతి

**టెన్త్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన వర్షిత**



ఖమ్మం,ఏప్రిల్30 : ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలంలో జరిగిన ఈ ఘటన అత్యంత విషాదకరం. పదోతరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ఉజ్వల భవిష్యత్తు ఉండాల్సిన ఒక విద్యార్థిని ప్రాణాలు తీసుకోవడం అందరినీ కలిచివేస్తోంది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామానికి చెందిన దారెల్లి వర్షిత (16) అనే విద్యార్థిని విషాదకరంగా ప్రాణాలు కోల్పోయింది. ఏప్రిల్ 24వ తేదీన ఉదయం ఆలస్యంగా నిద్రలేచినందుకు తల్లి మందలించగా, ఆవేశానికి లోనైన వర్షిత ఇంట్లో ఉన్న ఎలుకల మందు పేస్టు తిని అపస్మారక స్థితిలోకి వెళ్లింది. వర్షిత పరిస్థితి విషమించడంతో ముందుగా ఖమ్మంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. వైద్యులు ఆమెను బతికించడం కోసం ప్రయత్నాలు చేసిన పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందింది. మృతదేహాన్ని తిరిగి గ్రామానికి తీసుకువచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహిం చారు. వర్షిత బుధవారం విడుదలైన పదోతరగతి పరీక్షల ఫలితాల్లో 530 మార్కులు సాధించి చదువులో మంచి ప్రతిభ కనబరిచింది. ఈ విషయం తెలిసిన తర్వాత కుటుంబ సభ్యులు, స్నేహితులు, పాఠశాల ఉపాధ్యాయులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# రుణాల ఎగవేత కేసులో రఘురామకు ఊరట


## అరెస్ట్ చేయవద్దంటూ ఢిల్లీ కోర్టు బెయిల్



న్యూఢిల్లీ,ఏప్రిల్30 : ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, తెలుగుదేశం పార్టీ ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణ రాజుకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఊరట దక్కింది. బ్యాంకుల రుణ ఎగవేత కేసులో రఘురామకు బెయిల్ మంజూరు చేసింది. కోర్టుకు వ్యక్తిగతంగా రఘురామ గురువారం హాజరయ్యారు. ఈ కేసు దర్యాప్తు సమయంలో అరెస్ట్ చేయొద్దని ఆయనకు న్యాయస్థానం బెయిల్ ఇచ్చింది. రూ. 50,000 షూరిటీ బాండ్‌పై బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో ఆయనతో పాటు మరో నలుగురు నిందితులకు కూడా ఊరట లభించింది. సీబీఐ అధికారులు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో సుమారు 15 వేల పేజీలకు పైగా ఉండటంతో, ఆ పత్రాల పరిశీలనకు నిందితుల తరపు న్యాయవాదులు సమయం కోరారు. పత్రాల పరిశీలన కోసం తదుపరి విచారణను జులై 6, 2026కి వాయిదా వేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కంపెనీల లిక్విడేషన్ స్థితిగతులను తెలపాలని సంబంధిత అధికారులను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఆదేశించింది.

# సీతారాం ఆత్మహత్యలో చీకటి కోణం

- భార్య అక్రమ సంబంధాలతో తీవ్ర మనోవేదన
- తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డ టెక్కీ
- సూసైడ్ నోట్ ఆధారంగా వివరాలు వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 30 : రాష్ట్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో కలకలం సృష్టించిన టెకీ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో సీతారాం రాసిన 19 పేజీల సూసైడ్ నోట్ బయటకు రావడంతో ఆత్మహత్యకు గల కారణాలు తెలిశాయి. భార్య ఇతరులతో శారీరక సంబంధాలతో విసిగిపోయి సీతారాం ఆత్మహత్య చేసుకున్నట్టు నోట్ ద్వారా వెల్లడించాడు. తను వద్దని చెప్పినా వినలేదని సీతారాం పేర్కొన్నాడు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. సీతారాం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సీతారాం కుటుంబం బాచుపల్లిలో స్థిరపడింది. అయితే రేణుక తన భర్తకు తెలియ కుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకొని, ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ దారుణాలు చూడలేక భర్త సీతారం హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. భర్తకు తెలియకుండా ముగ్గురితో అక్రమ సంబంధం పెట్టుకున్న రేణుక రమణారెడ్డి అనే వ్యక్తితో కలిసినప్పుడు ప్రైవేట్ వీడియోలు తీసుకుంది. ఆ వీడియోలను రమణారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయగా.. తన భార్య నిజ స్వరూపం తెలిసిన సీతారాం ఫిబ్రవరి నెలలో 19 పేజీల సూసైడ్ లేఖ రాసి హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.సూసైడ్ లేఖలో నా భార్య రేణుకకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె ఏడాదిన్నరలోనే ముగ్గురితో అక్రమంగా శారీ రక సంబంధం పెట్టుకుంది. అంతేకాకుండా ప్రైవేట్ వీడియో లను రికార్డు చేసుకోగా.. ఓ లవర్ దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఆ దారుణాలను చూసి నేను ఎలా తట్టుకోగలగాలి.. అసలు రేణుకకు ఏం కావా లి. ప్రేమనా లేక శృంగారమా..? నా భార్యకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె నాకు నమ్మక ద్రోహం చేసింది అంటూ తన ఆవేదన తెలుపుతూ బలవన్మరణానికి పాల్పడ్డాడు. సూసైడ్ నోట్ ఆధారంగా దర్యాప్తు జరిపి రేణుకతోపాటు ఆమె ఇద్దరు లవర్స్ రమణారెడ్డి, శ్రవణ్ లను పోలీసులు అరెస్ట్ చేశారు. రేణుక నమ్మకద్రోహం వల్ల నెలకు రూ.2 లక్షలు సంపాదించే సీతారాం ప్రాణాలు పోగొట్టుకున్నాడని, ఇద్దరు పిల్లలు అనాథలు అయ్యారని కుటుంబసభ్యుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ఆస్తిపన్ను తగ్గించేందుకు లంచం

## ఎసిబికి పట్టుబడ్డ కాంట్రాక్ట్ ఉద్యోగి



సంగారెడ్డి,ఏప్రిల్30 : జిల్లాలోని సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు చేపట్టిన సోదాలు ముగిశాయి. ఆస్తి పన్ను తగ్గించడానికి బిల్లు కలెక్టర్ ఒక వ్యక్తి నుంచి రూ.35 వేలు లంచం డిమాండ్ చేశాడు. అప్పటికే బాధితుడి నుంచి రూ. 20 వేలు తీసుకున్నాడు. మిగిలిన నగదు కూడా ఇవ్వాలంటూ బాధితుడిపై నిఖిల్ రెడ్డి ఒత్తిడి పెంచాడు. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులను బాధితుడు ఆశ్రయించాడు. గురువారం రూ.15 వేలు బాధితుడి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు నిఖిల్ రెడ్డి చిక్కాడు. అనంతరం సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ నేతృత్వంలో గురువారం సోదాలు చేపట్టారు. దాదాపు 4 గంటల పాటు ఈ సోదాలు కొనసాగాయి. నిఖిల్ రెడ్డిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ వెల్లడించారు. మున్సిపల్ కార్యాలయంలో నిఖిల్ రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడని డీఎస్పీ తెలిపారు

# యువ పోలీసుల చేతుల్లోనే పోలీస్ శాఖ ప్రతిష్ట

పోలీసింగ్ విధానంలో నేడు అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, యువ పోలీస్ అధికారులు డిపార్ట్‌మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. సర్వీసులో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, పదవీ విరమణ పొందిన శివధర్ రెడ్డికి నూతన డీజీపీగా నియామకమైన సీవీ ఆనంద్ అభినందనలు తెలిపారు. ఆయన ఉద్యోగ జీవితంలో ఎన్నో సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొని పలు సంస్కరణలు తీసుకొచ్చారని ప్రశంసిచారు. తన సూచనలు, సలహాలు తీసుకునేందుకు తాను సిద్ధమేనని సీవీ ఆనంద్ తెలిపారు. 1970, 1980లో పోలీసుల పరిస్థితులు వేరని.. ఇప్పుడు పని చేస్తున్న పోలీస్ సిబ్బంది పరిస్థి తులు వేరన్నారు. గతం కంటే ఇప్పుడున్న పోలీసింగ్‌లో చాలా మార్పులు వచ్చాయని అన్నారు. పోలీస్ విభాగం పీపుల్స్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రస్తుత సిటిజన్స్‌కు ఫ్రెండ్లీ పోలీసింగ్ అవసరమన్నారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా ఫ్రెండ్లీ పోలీసింగ్ నడిపించామని తెలిపారు. భవిష్యత్తుకు అనుగుణంగా పోలీస్ శాఖను సిద్ధం చేశామని చెప్పారు. 'నా స్వరాష్ట్రానికి నన్ను డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు. సీఎం ఎన్నో కీలక బాధ్యతలు అప్పగించారు. నేను ఈ స్థాయికి రాడానికి కారణమైన నా గురువులకు ధన్యవాదాలు.

# గుజరాత్ పోలీసుల అదుపులో మురుగన్ గ్యాంగ్

- గ్యాంగ్ సమాచారంతో మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో సోదాలు



హైదరాబాద్, ఏప్రిల్ 30 : చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌ను గుజరాత్ పోలీసులు అరెస్ట్ చేశారు. మూడు ఫెర్టిలిటీ సెంటర్లకు మురుగన్ గ్యాంగ్‌తో సంబంధాలు ఉన్నాయి. ఈ గ్యాంగ్ ఇచ్చిన సమాచారం మూడు ఫెర్టిలిటీ సెంటర్లలో గుజరాత్ పోలీసులు సోదాలు నిర్వహించారు. ఆదిలాబాద్‌లో గత ఏడాది వరకు ఇటుకల బట్టిలో పని చేసిన మురుగన్, కేవలం ఒక్క ఏడాదిలోనే చైల్డ్ ట్రాఫికింగ్‌లో కింగ్‌పిన్‌గా ఎదిగాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. గత ఏడాది చైతన్యపురి కేసులో మురుగన్ పేరు వెలుగులోకి వచ్చింది. గత ఏడాది మూడు నెలల పాటు జైల్లో ఉన్న అతడు జూలైలో విడుదలయ్యాడు. ఆపై దేశవ్యాప్తంగా చైల్డ్ ట్రాఫికింగ్ ముఠా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నాడు. అతడి భార్య కృష్ణవేణి మరో గ్యాంగ్‌ను నడుపుతున్నట్టు గుజరాత్ పోలీసులు గుర్తించారు. ఈ మురుగన్ గ్యాంగ్ ఒక్క ఏడాదిలోనే 25 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం మురుగన్ గ్యాంగ్ సభ్యులు గుజరాత్ పోలీసుల అదుపులో ఉన్నారు. వారి విచారణలో మురుగన్ గ్యాంగ్‌కు మూడు ఫెర్టిలిటీ సెంటర్లతో సంబంధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మురుగన్ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు వారిని గుజరాత్‌కు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఫెర్టిలిటీ సెంటర్ల ప్రమేయానికి సంబంధించి పూర్తి స్థాయిలో గుజరాత్ పోలీసులు విచారణ చేపట్టారు. ఇదిలావుంటే హైదరాబాద్‌లోని ప్రముఖ నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీపై గుజరాత్ పోలీసులు తనిఖీలు చేశారని ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై నోవా సంస్థ నిర్వాహకులు క్లారిటీ ఇచ్చారు. చిన్నారుల అక్రమ రవాణా కేసులో మురుగన్ గ్యాంగ్‌కు.. తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ ఫర్టిలిటీ సెంటర్లపై గుజరాత్ పోలీసులు తనిఖీలు చేయలేదని వెల్లడించారు. చట్టానికి అనుగుణంగా తాము క్లినిక్ సెంటర్లు నిర్వహిస్తున్నామని, క్లినికల్, ఎథికల్, లీగల్ ప్రమాణాలకు అనుగుణంగా పనిచేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. సోషల్ మీడియాలో తమ ఫర్టిలిటీ సెంటర్లపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలు పూర్తి అవాస్తవమని, ఎలాంటి ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు తమ సెంటర్లపై జరగలేదని వివరణ ఇచ్చారు. రోగులకు ఉత్తమ సేవలు అందించడమే తమ లక్ష్యమని నోవా ఐవీఎఫ్ ఫర్టిలిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

# కుప్పం విమానాశ్రయానికి తొలగిని అడ్డంకులు

- భూసేకరణపై పిటిషన్లు కొట్టివేసిన సుప్రీం



న్యూఢిల్లీ,ఏప్రిల్30 : చిత్తూరు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కుప్పం విమానాశ్రయ ప్రాజెక్టుకు పెద్ద ఊరట లభించింది. భూసేకరణపై కొనసాగుతున్న న్యాయపరమైన వివాదాలకు ముగింపు పలుకుతూ సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. కుప్పం విమానాశ్రయం కోసం చేపట్టిన భూసేకరణను సవాల్ చేస్తూ దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్ ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో ముందుగా ఏపీ హై కోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు కోసం సుమారు 150 ఎకరాల భూమిని సేకరించేందుకు చిత్తూరు జిల్లా కలెక్టర్ జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్లు చట్టబద్ధమేనని సుప్రీంకోర్టు తేల్చింది. భూమి అనుకూలతపై సరైన ఆధారాలు లేవంటూ చక్రపాణి రెడ్డి, ఇతరులు చేసిన వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈ కేసుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఇతర అనుబంధ పిటిషన్లు కూడా ముగిసినట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ ప్రాజెక్టుకు ఉన్న న్యాయపరమైన అన్ని అడ్డంకులు పూర్తిగా తొలగిపోయాయి. ఈ తీర్పుతో కుప్పం విమానాశ్రయ పనులు త్వరలోనే వేగవంతం కానున్నాయి. ఈ ప్రాంతంలో పారిశ్రామిక అభివృద్ధి, రవాణా సౌకర్యాల మెరుగుదల, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి అవకాశాల పెరుగుదల వంటి అంశాలకు ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది. కుప్పం విమానాశ్రయ నిర్మాణం పూర్తయితే దక్షిణ ఆంధ్రప్రదేశ్‌కు మెరుగైన ఎయిర్ కనెక్టివిటీ, సమీప ప్రాంతాల ఆర్థిక వృద్ధి, టూరిజం అభివృద్ధి వంటి ప్రయోజనాలు కలగనున్నాయి.


# బెంగాల్లో విజయం ముమ్మాటికీ టిఎంసిదే

- కేంద్రం అధికార దుర్వినియోగం చేసినా ప్రజలు మావెంటే
- వీడియో సందేశం విడుదల చేసిన మమతా బెనర్జీ



కోల్‌కతా,ఏప్రిల్30 : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో 226 కంటే ఎక్కువ సీట్లను టీఎంసీ గెలుస్తుందని స్పష్టం చేశారు. 'మా-మాటి-మానుష్' స్ఫూర్తితో టీఎంసీ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకురావడానికి పశ్చిమ బెంగాల్ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మమతా బెనర్జీ ఓ వీడియో సందేశం పోస్టు చేశారు.ఎన్నికల ఫలితం ఇప్పటికే తమ పార్టీకి అనుకూలంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన పూర్తి యంత్రాంగాన్ని రంగంలోకి దించినా.. విజయం మాత్రం టీఎంసీదే అని తేల్చి చెప్పారు. మరోవైపు ఎగ్జిట్ పోల్స్ అంచనాలపైనా మమతా బెనర్జీ నిప్పులు చెరిగారు. ఎగ్జిట్ పోల్ గణాంకాలను బీజేపీ కార్యాలయం నుంచే విడుదల చేశారంటూ ఆరోపణలు గుప్పించారు. తమ పార్టీ కార్యకర్తలు, నేతల్లో భయాందోళనలు సృష్టించేందుకు బీజేపీ సంఖ్యలను తారుమారు చేసిందని మండిపడ్డారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో తన మద్దతుదారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసేందుకు కుట్ర చేశారని ధ్వజమెత్తారు. రెండో దశ ఎన్నిక వేళ తన నియోజకవర్గం భవానీపూర్‌లో రాత్రంతా దాడులు జరిగాయని మమతా ఆరోపించారు. ఓట్ల లెక్కింపు నాడు పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని మమతా కోరారు. రాష్ట్ర ప్రజలంతా ఐక్యంగా ఉండి లెక్కింపును నిశితంగా గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో విజయం టీఎంసీదే అని మరోసారి స్పష్టం చేశారు మమతా బెనర్జీ. కాగా, బుధవారం సాయంత్రం పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిశాయి. దీంతో వెంటనే ఎగ్జిట్ పోల్స్ విడుదల అయ్యాయి. అందులో మెజారిటీ పోల్స్.. బీజేపీనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని పేర్కొన్నాయి. దీనిపై మమతా బెనర్జీ స్పందిస్తూ వీడియో సందేశం రిలీజ్ చేశారు.

# ఎల్ఆర్ఎస్ రాయితీ పథకం కేవలం మూడు నెలలకే పరిమితం





హైదరాబాద్, ఏప్రిల్ 30 : తెలంగాణ రాష్ట్రంలో అనుమతి లేని మరియు అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న సామాన్య ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. పెండింగ్‌లో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణను వేగవంతం చేసే ఉద్దేశంతో, ఎల్ఆర్ఎస్ ఫీజు మరియు ఇతర చార్జీలపై ఏకంగా 25 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ ఈ మేరకు జీఓ ఎంఎస్ నెం. 131ని విడుదల చేసింది. ఈ రాయితీ పథకం మే 1నుంచి జూలై 31 వరకు మూడు నెలల పాటు అందుబాటులో ఉంటుంది. ఈ గడువు లోపు తమ ఎల్ఆర్ఎస్ చార్జీలను చెల్లించే దరఖాస్తుదారులకు మాత్రమే ఈ 25 శాతం డిస్కౌంట్ వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ ప్రక్రియను పూర్తి చేయడంలో ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడం. రాయితీ ప్రకటించడం ద్వారా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ప్లాట్లను/లేఅవుట్లను రెగ్యులరైజ్ చేసుకుంటారని ప్రభుత్వం భావిస్తోంది. తెలంగాణ రెగ్యులరైజేషన్ ఆఫ్ అన్‌అప్రూవ్డ్ అండ్ ఇల్లీగల్ లేఅవుట్ రూల్స్-2020 కు సవరణలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులను జారీ చేస్తూ, తదుపరి చర్యలు తీసుకోవాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్, మరియు పంచాయతీ రాజ్ కమిషనర్ సహా సంబంధిత అధికారులందరినీ ఆదేశించారు. దశాబ్దాల కాలం గా పెండింగ్‌లో ఉన్న అక్రమ లేఅవుట్ల సమస్యకు ఈ రాయితీ ద్వారా పరిష్కారం లభిస్తుందని, తక్కువ ధరకే తమ భూములను చట్టబద్ధం చేసుకునే సువర్ణావకాశం ప్రజలకు దక్కిందని అధికారులు విశ్లేషిస్తున్నారు.

# త్వరలో ట్రైబల్ వర్సిటి క్యాంపస్ నిర్మాణం

- రూ.7,823 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రధాని పర్యటనపై కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 30 : సమ్మక్క- సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మే 10న హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ.. రూ.7,823 కోట్ల విలువైన పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభిస్తారని చెప్పారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో కేంద్రమంత్రి ఈమేరకు మీడియాతో మాట్లాడారు. 'హైదరాబాద్‌లో పెట్రోలియం ఉత్పత్తులకు సంబం ధించి టెర్మినల్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. మహబూబ్ నగర్‌లో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారి పనులకు వర్చువల్‌గా శ్రీకారం చుట్టనున్నారు. హఫీజ్‌పేట, జోగులాంబ రైల్వే స్టేషన్లను, కాజీపేట- విజయవాడమధ్య మూడో రైల్వే లైన్‌ను ప్రారం భిం చనున్నారు. రాష్ట్రంలో రూ.85 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి. హైదరాబాద్-యాదగిరిగుట్ట ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమయ్యాయి. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నాం. 2030నాటికి రూ.9 ల కోట్ల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తులను ఎగుమతి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాం అని కిషన్‌రెడ్డి తెలిపారు.

# రేంవత్ తీరుతె పోలీస్ శాఖకు అప్రతిష్ట

- బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్, ఏప్రిల్ 30 : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతో రాష్ట్రంలోని పోలీసులు తప్పుల మీద తప్పులు చేస్తున్నారని, హోంమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి పోలీసు డిపార్ట్‌మెంట్ బలి అవుతోందని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పా టు చేసిన మీడియా సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ నాయకులను ఇరికించే కుట్రలు చేస్తున్నారని వెల్లడించారు. ఈ కేసులో 350 మంది సాక్షులను విచారించి ఇప్పటి వరకు ఛార్జ్ షీట్ దాఖలు చేయలేదని విమర్శించారు. ఛార్జ్ షీట్‌లో బీఆర్ఎస్ నాయకుల పేర్లు పెట్టాలని అధికారులపై సీఎం ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు.ఒక సీనియర్ జర్నలిస్టును ఇరికించి, అతను సుప్రీంకోర్టులో బెయిల్ పిటిషన్ వేస్తే బీఆర్ఎస్ నాయకుల పేర్లు చెప్తారా లేదా అని బెదిరిస్తున్నారని ఆరోపించారు.

# చిన్నారిని మింగిన మిషన్ భగీరథ గుంత

- పూడ్చకుండా ఉంచడంతో గుంతలో పడ్డ ఐదేళ్ల మోక్షిత
- అధికారుల తీరుపై గ్రామస్థుల ఆందోళన

జనగామ,ఏప్రిల్30 : జిల్లాలోని బచ్చన్నపేట మండలం ఆలీంపూర్ గ్రామంలో అత్యంత విషాదకర ఘటన చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యం ఒక పసి ప్రాణాన్ని బలితీసుకుంది. మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మత్తుల కోసం తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో, ప్రమాదవశాత్తు అందులో పడి మోక్షిత అనే ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటనతో గ్రామంలో తీవ్ర విషాదం అలుముకుంది.స్థానికుల కథనం ప్రకారం.. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట మిషన్ భగీరథ పైపులైన్ లీక్ కావడంతో, సుమారు 20 రోజుల క్రితం అధికారులు మరమ్మత్తుల కోసం 4 మీటర్ల లోతున భారీ గుంతను తవ్వారు. అయితే, మరమ్మత్తులు పూర్తయినా లేదా మధ్యలో నిలిచిపోయినా, ఆ గుంతను పూడ్చకుండా అధికారులు అలాగే వదిలేశారు. గత మూడు వారాలుగా ఆ మృత్యు గుంత పాఠశాల ముందే దర్శనమిస్తున్నా, ఏ ఒక్క అధికారి కూడా దాని భద్రత గురించి పట్టించుకోలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలీంపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో కవిత అనే మహిళ ఆయాగా పనిచేస్తోంది. ఆమె తన ఇద్దరు కుమార్తెలు దక్షిత , మోక్షితలను వెంటబెట్టుకుని పాఠశాలకు వచ్చింది. తల్లి లోపలికి వెళ్లిన క్రమంలో, ఆడుకుంటూ వెళ్లిన మోక్షిత ప్రమాదవశాత్తు ఆ గుంతలో పడిపోయింది. పక్కనే ఉన్న అక్క దక్షిత ఈ విషయాన్ని వెంటనే తల్లికి చెప్పడంతో, కవిత పరుగులు తీస్తూ వచ్చి తన చిన్నారిని కాపాడుకునేందుకు గుంతలోకి దూకింది. కవితతో పాటు దక్షిత కూడా గుంతలోకి దూకింది. గుంతలో మునిగిపోతున్న వారిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి ముగ్గురినీ బయటకు తీశారు. అయితే, అప్పటికే జరగరాని నష్టం జరిగిపోయింది. తల్లి కవిత, అక్క దక్షిత ప్రాణాలతో బయటపడినప్పటికీ, ఐదేళ్ల మోక్షిత అప్పటికే మృతి చెందింది. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ తన కళ్లముందే విగతజీవిగా పడి ఉండటంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

# (మొదటిపేజీ తరువాయి)

## సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌తో జవాబుదారీతనం

గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ... వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాల మాయాదేవి, సెర్ప్ సీఈవో దివ్య, ఉన్నత విద్యా శాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి సంతోష్, బిసి కార్యదర్శి బి.సైదులు పాల్గొన్నారు.

## కొత్త ఆయుధంతో విరుచుకు పడతాం

ఆయన కొట్టిపారేశారు. అమెరికాకు చెందిన విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్‌పై తమ దళాలు దాదాపు ఏడు క్షిపణులతో విరుచుకుపడ్డాయన్నారు. దీంతో అది కొన్ని రోజులు కార్యకలాపాలను నిర్వహించలేకపోయిందన్నారు. అమెరికా దిగ్బంధనం ఉన్నప్పటికీ.. నౌకలు కొన్ని తమ ఓడరేవుల నుంచి వెళ్తున్నాయన్నారు. మరికొన్ని వాటి గమ్యస్థానాలకు కూడా చేరుకుంటున్నాయని వెల్లడించారు. ఈసందర్భంగా యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన తమ ప్రజల కోసం చివరి రక్తపుబొట్టు వరకు పోరాడి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన ప్రతిజ్ఞ చేశారు. శత్రువులు పశ్చాత్తాపం చెందేవరకు వారిని దెబ్బ కొడతామన్నారు.

## శ్రామిక వర్గానికి ఎప్పుడూ అండగా ఉన్నాం

కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే అసంఘటిత రంగంలో పని చేస్తున్న గిగ్ వర్కర్ల కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేశామన్నారు. తెలంగాణ గిగ్, ఎ÷-లాట్ ఫాం వర్కర్స్ సంక్షేమ బిల్లు తీసుకువచ్చినట్టు తెలిపారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేయడం జరిగిందన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ దేశానికే తలమానికంగా ఉన్న సింగరేణి కార్మికులకు, దసరా, దీపావళి పండుగలకు ముందే బోనస్ చెల్లించడం జరిగిందన్నారు. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 5 వేలు చొప్పున బోనస్ ఇచ్చినట్టు గుర్తు చేశారు. దాంతోపాటు, పలు బ్యాంకుల సహకారంతో కార్మికులకు కోటి రూపాయల బీమా సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించినట్టు వివరించారు. గల్ఫ్ దేశాల్లో పని చేసే తెలంగాణ కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. తెలంగాణ కార్మికులు ఆయా దేశాల్లో ఏ కారణంతో మరణించినా.. వారి కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించడం జరుగుతుందన్నారు.

## మైక్రో ఫైనాన్స్ స్కామ్ కేసు

పడిన రోజే ఖాతా నుంచి విత్ డ్రా చేసినట్లు నిర్ధారించారు. అయితే, ఎంత మేర నగదు ట్రాన్స్‌ఫర్ అయ్యిందో అధికారులు ఇంకా వెల్లడించలేదు.మరోవైపు రమావత్ మధు అకౌంట్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) సీజ్ చేసింది. రమావత్ మధు, హిమకాంత్‌రెడ్డి, శివ చౌహాన్‌కు చెందిన అకౌంట్ల పూర్తి వివరాలను ఇవ్వాలని సంబంధిత బ్యాంకులకు పోలీసులు లేఖ రాశారు. మరోవైపు నిందితులతో తమకు ఎలాంటి సంబంధం లేదని, ఈ కేసులో తమ పేర్లను అనవసరంగా లాగుతున్నారని మంగ్లీ, ఆమె సోదరుడు శివ చౌహాన్ ఆరోపిస్తున్నారు. కాగా, నిందితుడు రమావత్ మధు.. అధిక వడ్డీ పేరుతో వేల మంది నుంచి వందల కోట్ల రూపాయలు వసూలు చేశాడని ఆరోపణలు ఉన్నాయి. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు.

## ఎరుగుతున్న ఎండల తీవ్రత



అందుబాటులో ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని, జల విద్యుత్ ఉత్పత్తిని సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, అన్ని విద్యుత్ సంస్థలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థ స్థిరంగా ఉందని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేశామని అధికారులు మంత్రికి హామీ ఇచ్చారు. పరిస్థితిని నిశితంగా పర్యవేక్షించాలని, అన్ని వర్గాల వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ అగ్ర ప్రాధాన్యమని స్పష్టం చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతరం అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు.

## 18 నెలల బాలుడికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్

మార్పిడి చేశారు. తండ్రి లివర్ నుంచి కొంత భాగాన్ని సేకరించి చిన్నారికి అమర్చారు. 14 గంటల పాటు క్లిష్ట శస్త్రచికిత్స కొనసాగింది. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం కింద పూర్తిగా ఉచితం గా డాక్టర్లు చికిత్స అందజేశారు. దేశంలో ప్ర భుత్వ రంగంలో ఇలాంటి శస్త్రచి కిత్సలు అత్య ంత అరుదని డాక్టర్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఉస్మానియా వైద్యుల బృందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు.

## తెలుగు రాష్ట్రాలకుచల్లటి కబురు

కురిసే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో గంటకు 50- 60 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముంది. శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనున్నట్టు సమాచారం. హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకారం.. ద్రోణి/వాయు అస్థిరత ఇప్పుడు దక్షిణ అంతర్గత కర్ణాటక నుంచి తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో విస్తరించి ఉంది. అంతర్గత మహారాష్ట్ర సహా దానిని ఆనుకుని ఉన్న తెలంగాణపై సముద్ర మట్టానికి 3.1 కి.మీ. ఎత్తులో ఒక ప్రతిచక్రవాత వలయం ఏర్పడింది. దీంతో రానున్న మూడు రోజుల్లో కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. రాష్ట్రంలో రానున్న మూడు రోజులలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశం ఉంది.ఇదిలావుంటే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, విశాఖ, విజయవాడ, నెల్లూరు వంటి ప్రాంతాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. తెలంగాణలో వడదెబ్బ మృతుల సంఖ్య పెరిగిపోతోంది. పగలంతా ఎండ కొడుతుండగా.. సాయంత్రం మాత్రం అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఏపీలోనూ పిడుగులతో కూడిన వర్షాలు కురిసే సూచనలు కనిపిస్తున్నాయని అధికారులు తెలిపారు.

## నష్టాలతో ప్రారంభమైన మార్కెట్లు



క్షీణించి, 23,899 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ సూచీలో బజాజ్ ÷నాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, కోల్ ఇండియా, ఓఎన్‌జీసీ షేర్లు లాభాల్లో ఉండగా.. ఎటర్నల్, శ్రీరామ్ ఫైనాన్స్, అల్ట్రా టెక్ సిమెంట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, ఎంఅండ్‌ఎం షేర్లు నష్టాల్లో ఉన్నాయి. అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. ఉదయం సెషన్‌లో తొలిసారి ఏకంగా 95.07 వద్ద ప్రారంభమై.. సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని తాకింది.

# టీఅమ్ స్పిరిట్‌తోనే అవార్డే సాధించా

- మనమంతా కలసికట్టుగా పనిచేస్తే అద్భుతాలు
- 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' కార్యక్రమంలో బాబు



అమరావతి,ఏప్రిల్30 : టీమ్ ఏపీ కృషితోనే బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు వచ్చిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మంత్రులు, అధికారులు, ఉద్యోగులే రియల్ విన్నర్స్ అని పేర్కొన్నారు. భవిష్యత్ లక్ష్యాలపై సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధి వ్యూహాలపై మంత్రులు, అధికారులతో సీఎం చర్చించారు. విభజన నుంచి అభివృద్ధి వరకు ఈ సమావేశంలో కీలక చర్చలు జరి గాయి. గురువారం బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్-2025 అవార్డు సీఎంకు వచ్చినందుకు మంత్రులు, సీఎస్, డీజీపీ, సెక్రటరీలు, హెచ్వోడీలకు ఆత్మీయ విందు సమావేశం ఏర్పాటు చేశారు. వివిధ శాఖల్లో చక్కటి పనితీరు కనబరచిన జిల్లా, మండల స్థాయి ఉద్యోగులనూ విందుకు సీఎం ఆహ్వానించారు. 'డిన్నర్ విత్ ది రియల్ విన్నర్స్' అనే పేరుతో సీఎం ఆత్మీయ విందు ఇచ్చారు. డిన్నర్ కంటే ముందు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సమావేశం ప్రారంభం కాగానే చప్పట్లతో సీఎం చంద్రబాబుకు మంత్రులు, అధికారులు, ఉద్యోగులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తగా మంత్రి పయ్యావుల కేశవ్ వ్యవహరించారు. ఈ విందుకు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర విభజన, వైసీపీ హయాంలో జరిగిన పరిణామాలను ఈ సమావేశంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వివరించారు. సీఎం చంద్రబాబు డీఎన్ఏలోనే సంస్కరణలు ఉన్నాయని పయ్యావుల వ్యాఖ్యానించారు. విద్యుత్, ఓపెన్ స్కై పాలసీ, టెలికాం రంగం, ఐటీ, డ్రిప్ ఇరిగేషన్, పీపీపీ వంటి రంగాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నప్పుడే సంస్కరణలు తీసుకువచ్చారని పయ్యావుల ప్రస్తావించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పరంగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, చేరుకోవాల్సిన లక్ష్యాలు, అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై ఈ సమావేశంలో సీఎం చర్చించారు. డిన్నర్ విత్ రియల్ విన్నర్స్ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పనితీరును మంత్రి నారా లోకేశ్ వివరించారు. ప్రభుత్వంలో ఒక నిర్ణయం తీసుకున్న తర్వాత దాన్ని అమలు చేసేందుకు మంత్రులు, అధికారుల వెంటపడి టాస్క్ పూర్తి చేయించే బాధ్యతలను సీఎం తీసుకుంటారని చెప్పుకొచ్చారు. పరిపాలనలోనూ, రాజకీయాల్లోనూ ఎలాంటి ఇగోలకు పోకుండా పనిచేసే వ్యక్తి చంద్రబాబు అని వ్యాఖ్యానించారు. పెట్టుబడులను తీసుకువచ్చే విషయంలో, పారిశ్రామిక వేత్తలను కలిసే విషయంలో ఇగోలను పక్కన పెట్టి టీమ్ స్ఫూర్తితో పని చేస్తున్నామని లోకేశ్ తెలిపారు. సీఎం చంద్రబాబు చాలా సందర్భాల్లో 1995-1999 పాలన గురించి చెబుతారని... ఇకపై 2024-29 పాలన గురించి చెప్పుకునేలా తాము పనిచేస్తామని పేర్కొన్నారు.

## సర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి

### పార్టీ శ్రేణులను హెచ్చరించిన సజ్జల



అమరావతి,ఏప్రిల్30 : ఓటర్ల జాబితా సవరణపై అప్రమత్తంగా ఉండాలని వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని మరింత జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఎస్ఐఆర్ పై సమావేశం నిర్వహించారు. ఈ భేటీకి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి లేళ్ళ అప్పిరెడ్డి, పార్టీ ఐటీ, సోషల్ మీడియా, బూత్ కమిటీలకు సంబంధించి అధ్యక్షులు, పలు జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సజ్జల మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ పేరుతో అధికార పక్షం చేసే అవకతవకలు, అక్రమాలను అడ్డుకోవాలని సూచించారు. పార్టీ ఓట్లు తొలగించకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. బూత్ కమిటీలు చేయబోయే పని చాలా కీలకమన్నారు. ఇటీవల సాంకేతిక పరిజ్ఞానం చాలా పెరిగిందన్నారు. అదే టెక్నాలజీ మోసం చేయడానికి కూడా వినియోగపడుతుందని వెల్లడించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, మనం చాలా అప్రమత్తంగా పని చేయాల్సి ఉంటుందని వెల్లడించింది. ఓట్లు తీసివేయకుండా, అక్రమ ఓట్లు చేర్చకుండా చాలా జాగ్రత్త పడాల్సి ఉంటుంది. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో చంద్రబాబు నాయుడు తర్వాతే ఎవరైనా. 2019 ఎన్నికలకు ముందు 40 నుంచి 45 లక్షల ఓట్లు తొలగించారు. ఆ సమయంలో జగన్ నాయకత్వంలో ఢిల్లీకి వెళ్లి ఎన్నికల సంఘాన్ని కలిసి ఫిర్యాదు చేశాం. 2002 నాటి ఓటర్ల జాబితాను ఆధారంగా తీసుకుని ఓటర్ల జాబితా సవరణ జరుగుతోంది. అప్పటి నుంచి రాష్ట్రంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. 1984 తర్వాత పుట్టి ఓటర్ల జాబితాలో ఉన్నవారు తిరిగి మళ్ళీ తమను తాము నిరూపించుకుంటేనే ఓటర్ల తుది జాబితాలో ఉంటారు.. ఈ విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి.మిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్ఐఆర్‌లో భాగంగా 97 లక్షల మంది ఓటర్లను తొలగించారు. ఎస్ఐఆర్ ప్రారంభానికి ముందే అవసరమైన డేటా మొత్తం సిద్ధం చేసుకోవాలి. జోన్‌ల వారీగా చురుకైన కార్యకర్తలను గుర్తించి వారికి తగిన శిక్షణ ఇవ్వాలి. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా టీమ్‌లను సిద్ధం చేసి, ఎస్ఐఆర్‌పై ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలి. మైక్రో లెవల్ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషన్ బలంగా ఉంటే ఎలాంటి పరిస్థితుల్లోనైనా విజయం సాధించవచ్చు. 2019 ఎన్నికల ఫలితాల కంటే మెరుగైన ఫలితాలు సాధించే సామర్థ్యం మనకు ఉందన్నారు.


## ఉద్యోగాల కల్పన లక్ష్యంగా కృషి

- కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో మంత్రులు




అమరావతి,ఏప్రిల్30 : ఉద్యోగాల సృష్టిలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అధికారులకు కేబినేట్ సబ్‌కమిటీ సూచించింది. ఏపీ మంత్రివర్గ ఉపసంఘ సమావేశం గురువారం రాష్ట్ర సచివాలయంలో జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై అధికారులతో మంత్రులు చర్చించారు. ప్రధానంగా ఏపీలో 20 లక్షలకు పైగా ఉద్యోగ కల్పన లక్ష్యంపై మంత్రులు మాట్లాడారు. అలాగే, ఇన్వెస్ట్‌మెంట్, ఎంప్లాయిమెంట్‌పై మంత్రులు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో మంత్రులు కందుల దుర్గేశ్, టీజీ భరత్, గొట్టిపాటి రవి కుమార్, కొండపల్లి శ్రీనివాస్, సీఎస్ జి. సాయిప్రసాద్ హాజరయ్యారు. ఉద్యోగ వివరాలు ఒకే పోర్టల్‌లో నమోదు చేయాలని మంత్రులు ఆదేశిం చారు. పారదర్శకంగా ఉద్యోగ డేటా నమోదు చేయాలని సూచించారు. శాఖల వారీగా నిరంతర పర్యవేక్షణకు ఆదేశాలు జారీ చేశారు. భారీ, మధ్య, చిన్న పరిశ్రమల స్థాపనపై అధికారులు దృష్టిసారించాలని అన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఉద్యోగాల విస్తరణకు ప్రాధాన్యం కల్పించాలని చెప్పారు. ఉద్యోగాల కల్పన వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. అలాగే, పెట్టుబడులు ఉద్యోగాల అనుసంధానంపై మంత్రులు దృష్టి సారించారు. ఆయా అంశాలపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రులు సమగ్రంగా చర్చించారు. ఉద్యోగావకాశాల పెంపు దిశగా చర్యలు వేగవంతం చేయాలని అధికారులకు మంత్రులు దిశానిర్దేశం చేశారు.

## రామాలయ నిర్మాణంపై పిటీషన్లు ఉపసంహారణ



అమరావతి,ఏప్రిల్30 : పశ్చిమగోదావరి జిల్లాలోని ఆకివీడు రామాలయం నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను వెనక్కి తీసుకున్నారు. ఏపీ హైకోర్టులో గురువారం విచారణ జరిగింది. ఆలయ నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ వేసిన పిటిషన్లను పిటిషనర్లు ఉపసంహరించుకున్నారు. రామాలయం నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నాయని ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కోర్టుకు వివరించారు. రామాలయం ఎలాన్‌తో పాటు ఆర్డీవో, ఎమ్ఆర్‌వో ఇచ్చిన అనుమతుల వివరాలను తెలిపారు. దీంతో 'రామాలయం నిర్మాణం చేసుకోవచ్చు కదా' అని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ దశలో పిటిషనర్ల తరఫు న్యాయవాది జడ శ్రవణ్ మాట్లాడుతూ.. 'పిటిషన్‌ను ఉపసంహరించుకుంటామని' తెలిపారు. అయితే ఎలాన్‌ను సవాల్ చేస్తామని స్పష్టం చేశారు. పిటిషన్ ఉపసంహరణకు అనుమతి ఇవ్వాలని కోరగా.. అందుకు హైకోర్టు అనుమతి ఇచ్చింది.

## జిల్లాకో అరకు కాఫీ స్టాల్



విజయవాడ,ఏప్రిల్30 : రాష్ట్రంలో మహిళా సాధికారతకు 'పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ' (మెప్మా), నేటివ్ అరకు కాఫీ సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. మిషన్ డైరెక్టర్ వాకాటి కరుణ ఆధ్వర్యంలో కుదిరిన ఈ ఎంవోయూ ద్వారా.. రాష్ట్రవ్యాప్తంగా ఫ్రాంచైజ్ విధానంలో అరకు కాఫీ దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి జిల్లాలో రెండేళ్లలో రెండు అరకు కాఫీ షాపులు స్థాపించనున్నారు. మహిళలకు ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలు కల్పించడం ఒప్పంద ప్రధాన లక్ష్యం. రూ.5.90 లక్షలతో ఓ దుకాణం, రూ.పది లక్షలతో మొబైల్ కాఫీ షాప్ వంటి రెండు మోడల్స్‌ను ఎంపిక చేశారు. పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ పథకాల కింద మహిళలకు రుణాలు, సబ్సిడీలు అందజేస్తారు.

## లోకేశ్ పక్కా ప్రణాళిక

- గుణాత్మక మార్పులు: పల్లా



అమరావతి,ఏప్రిల్30 : విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విజన్, పక్కా ప్రణాళికతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది పడిందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఏపీలో పదో తరగతి ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో అమరావతిలో ఏపీ టీడీపీ చీఫ్ పల్లా శ్రీనివాసరావు స్పందించారు. మంత్రి నారా లోకేశ్ అమలు చేసిన 100 రోజుల ప్రణాళికతో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో గుణాత్మక మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడం అభినందనీయమని ఏపీ టీడీపీ చీఫ్ చెప్పారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ ఈ సందర్భంగా ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుల కృషి ప్రశంసనీయమన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఉత్తీర్ణత శాతం పెరగడం విద్యా రంగంలో పురోగతికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు రావడంతోపాటు బాలికలు ముందుండటం శుభపరిణామం అని పల్లా శ్రీనివాసరావు తెలిపారు.

## రాష్ట్ర సంక్షేమం కోసం రాజశ్యామల యాగం

- సొంతూరులో యాగం నిర్వహణపై మంత్రి పార్థసారథి



అమరావతి,ఏప్రిల్30 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని మంత్రి కొలుసు పార్థసారథి రాజశ్యామల యాగం నిర్వహించారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పేర్లపై ప్రత్యేకంగా ఈ యాగాన్ని చేశారు. కృష్ణా జిల్లా పామర్రు నియోజకవర్గంలోని తన సొంత గ్రామమైన కారకంపాడులో రాజశ్యామల యాగాన్ని మంత్రి పార్థసారథి నిర్వహించారు. పెద్దఎత్తున హోమ గుండాన్ని నిర్మించి, పండితులతో యాగం జరిపించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని మంత్రి కోరుకున్నారు. ఈ యాగంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు కూటమి శ్రేణులూ పెద్దఎత్తున తరలివచ్చారు. రాజశ్యామల యాగంతో మంత్రి పార్థసారథి స్వగ్రామంలో సందడి వాతా వరణం నెలకొంది.హిందూ సంప్రదాయాల ప్రకారం రాజకీయ విజయం, శత్రువులపై పైచేయి, అపారమైన జ్ఞానం, కీర్తి ప్రతిష్ఠల కోసం రాజశ్యామల యాగాన్ని చేస్తుంటారు. జ్ఞాన సరస్వతి రూపమైన రాజశ్యామల దేవిని ప్రసన్నం చేసుకునేందుకు భక్తులు ఈ యాగాన్ని చేస్తారు. పూర్వ కాలంలో చేసే రాజసూయ యాగంతో సమానమైన ఫలితాలను రాజశ్యామల యాగం ఇస్తుందని పండితులు చెబుతుంటారు.

## ఎదురెదురుగా ఢీకొన్న ఆటోలు

- ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు




ఒంగోలు,ఏప్రిల్30 : ఎదురెదురుగా వస్తున్న రెండు వాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం ఉప్పుగుండూరు వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. జరుగుమల్లి మండలానికి చెందిన ట్రాలీ ఆటో.. ఉప్పుగుండూరు బైపాస్ నుంచి స్వగ్రామానికి వెళ్తోంది. మార్గంమధ్యలో ఉప్పుగుండూరు వద్ద ఎదురుగా వస్తున్న ప్యాసింజర్ ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్యాసింజర్ ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడ్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఇకపోతే కర్నూలు నగరంలోని చెన్నమ్మ సర్కిల్ వద్ద ఉన్న జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొంది.ట్రాక్టర్ బోల్తా పడటంతో అందులో ఉన్న తండ్రీ కుమారులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు గాయపడిన వారిని చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. బస్సులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటనపై ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



# శ్రీవారిని దర్శించుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు టీటీడీ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. డిప్యూటీ సీఎం రాకను గమనించిన భక్తులు ఆయనను కలిసేందుకు ఉత్సాహం చూపారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు ఆయనతో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. ఆలయ సేవకులు కూడా మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి ఫోటోలు దిగారు. భక్తులతో ఆయన ఎంతో సావధానంగా ముచ్చటించారు.

**శ్రీకాళహస్తీశ్వరుడి ని దర్శించుకున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుటుంబ సభ్యులు**

తిరుమల దర్శనం అనంతరం భట్టి విక్రమార్క శ్రీకాళహస్తికి చేరుకున్నారు. అక్కడ శ్రీకాళహస్తీశ్వర దేవస్థానంలో కొలువుదీరిన పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.



# తెలంగాణకు మోదీ 'మే' కానుక!

**10న రాష్ట్రానికి ప్రధాని.. రూ.7,823 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.. త్వరలోనే ట్రైబల్ యూనివర్సిటీ పనులు: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి.**

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్, మే 1 (న్యూస్ నెట్‌వర్క్): భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 10న తెలంగాణలో పర్యటించనున్నారు. మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి రాష్ట్రానికి వస్తున్న ఆయన.. సుమారు రూ.7,823 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.

ములుగు జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'సమ్మక్క–సారలమ్మ' సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు కిషన్ రెడ్డి ప్రకటించారు. ఇప్పటికే దీనికి సంబంధించి రూ.1,000 కోట్లు మంజూరయ్యాయని, కాంపౌండ్ వాల్ నిర్మాణంతో పనులు మొదలవుతాయని పేర్కొన్నారు.

**అభివృద్ధి పథంలో రైల్వే, రహదారులు:**

మోదీ పర్యటనలో భాగంగా వర్చువల్ పద్ధతిలో పలు కీలక ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు:

రవాణా: హైదరాబాద్‌లో రూ.611 కోట్లతో నిర్మించిన పెట్రోలియం ఉత్పత్తుల టర్మినల్ (మల్కాపూర్) ప్రారంభం.

హైవేలు: మహబూబ్‌నగర్ ప్రాంతంలో రూ.3,175 కోట్ల విలువైన నేషనల్ హైవే పనులకు శంకుస్థాపన.

రైల్వే: కాజీపేట–విజయవాడ మధ్య మూడో రైల్వే లైన్ (రూ.1,243 కోట్లు), హఫీజ్‌పేట, జోగుళాంబ రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనుల ప్రారంభం.

భారీ పెట్టుబడులు: రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం రూ.85,000 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని మంత్రి వివరించారు.

**పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ సభ:**

అభివృద్ధి పనుల అనంతరం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించనున్నారు. దక్షిణ ప్రాంత రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) కు సంబంధించి డీపీఆర్ పనులు జరుగుతున్నాయని, భూసేకరణ పూర్తికాగానే కేబినెట్ ఆమోదంతో ప్రధాని చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.



# నేపాల్‌లో ఘోర ప్రమాదం

- లోయలో పడ్డ జీపు.. 17 మంది మృతి!
- వైశాఖ పౌర్ణమి వేడుకలకు వెళ్తుండగా విషాదం..
- 800 మీటర్ల లోతులోకి జారిన వాహనం..

**భారీ వర్షాల మధ్య కొనసాగుతున్న సహాయక చర్యలు.**

బలగం టీవీ, హైదరాబాద్

కాఠ్మాండూ, మే 1: నేపాల్‌లోని రోల్పా జిల్లాలో గురువారం జరిగిన ఒక భయంకరమైన రోడ్డు ప్రమాదం 17 మంది ప్రాణాలను బలిగొంది. భక్తులతో వెళ్తున్న ఒక ప్రైవేట్ జీపు కొండ ప్రాంతంలో అదుపు తప్పి సుమారు 800 మీటర్ల లోతు ఉన్న లోయలోకి పడిపోయింది. ఈ దుర్ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

పోలీసుల కథనం ప్రకారం.. వైశాఖ పౌర్ణమి సందర్భంగా రోల్పా జిల్లా థవాంగ్ రూరల్ మునిసిపాలిటీ పరిధిలోని జల్‌జలాలో ఉన్న ఒక ప్రసిద్ధ హిందూ దేవాలయంలో జరిగే వేడుకల్లో పాల్గొనేందుకు భక్తులు జీపులో బయలుదేరారు. మార్గమధ్యంలో జల్‌జలా సమీపంలో వాహనం అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. మృతులంతా స్థానిక భక్తులుగా గుర్తించారు. గత కొన్ని రోజులుగా ఆ ప్రాంతంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రహదారి పూర్తిగా బురదమయంగా మారింది. ఈ క్రమంలోనే వాహనం ఒక్కసారిగా జారి లోయలోకి పడిపోయి ఉండవచ్చని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదం జరిగిన సమయంలో జీపులో ఎంతమంది ప్రయాణిస్తున్నారనే దానిపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అయితే, కొండ ప్రాంతం కావడం, దానికి తోడు భారీ వర్షం కురుస్తుండటంతో మృతదేహాల వెలికితీతకు తీవ్ర ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# కార్మిక సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- మే డే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వ పాలన
- ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్

కార్మిక లోకానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు 'మే డే' సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందిరమ్మ రాజ్యంలో కార్మికుల శ్రేయస్సుకే ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే శ్రామిక వర్గం కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని ఆయన కొనియాడారు. ముఖ్యంగా సింగరేణి చరిత్రలో నిలిచిపోయేలా కార్మికులకు రూ. 1 కోటి ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించామని, అలాగే సహజ మరణం పొందిన కార్మికుల కుటుంబాలకు రూ. 10 లక్షల ఆర్థిక సాయం అందజేస్తూ కొండంత అండగా నిలుస్తున్నామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. గనుల్లో ప్రాణాలకు తెగించి పనిచేసే కాంట్రాక్టు కార్మికుల కష్టాన్ని గుర్తించి, సంస్థ చరిత్రలోనే తొలిసారిగా వారికి రూ. 5 వేల బోనస్ అందించడమే



కాకుండా, పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేసి కార్మిక బిడ్డలకు ఉపాధి కల్పించామని వివరించారు. ఇంధన శాఖ పరిధిలోని ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పనిచేసే ఉద్యోగులకు సైతం రూ. 1 కోటి ప్రమాద బీమాను వర్తింపజేస్తూ ప్రభుత్వం భరోసా ఇచ్చిందని తెలిపారు.

ఆర్టీసీలో గత ప్రభుత్వ అణచివేత ధోరణిని పక్కనపెట్టి, కార్మిక ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తున్నామని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులను కాపాడేందుకు యూనియన్లను పునరుద్ధరించడంతో పాటు, త్వరలోనే ఎన్నికలు నిర్వహించడానికి సన్నద్ధమవుతున్నామని, వారి 32 ప్రధాన డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఆధునిక కాలంలో పెరుగుతున్న గిగ్ వర్కర్ల రక్షణ కోసం రూ. 5 లక్షల ప్రమాద బీమాతో కూడిన ప్రత్యేక సంక్షేమ బిల్లును తీసుకువచ్చామని, అలాగే గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు.

మే డే స్ఫూర్తితో రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములైన ప్రతి కార్మికుడికి సామాజిక భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని డిప్యూటీ సీఎం పునరుద్ఘాటించారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలే అందించాలి..

- కో-మార్కెటింగ్‌పై కఠిన నిబంధనలు..
- సరిహద్దుల్లో నిఘా పెంచాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, హైదరాబాద్

లిలిహైదరాబాద్, మే 1 (న్యూస్ నెట్‌వర్క్):లిలి రాష్ట్రంలోని రైతులకు వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో వ్యవసాయ శాఖ, సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, విత్తన కంపెనీ ప్రతినిధులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నకిలీ విత్తనాల విక్రయాలపై 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబించాలని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

రాబోయే వానాకాలం సీజన్‌లో సుమారు 134.66 లక్షల ఎకరాల్లో సాగు జరిగే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. దీనికోసం 19.42 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమని అంచనా వేయగా, ప్రస్తుతం 38.21 లక్షల క్వింటాళ్ల నిల్వలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. పత్తి సాగు కోసం 104 లక్షల ప్యాకెట్ల అవసరం ఉండగా, 212.11 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. మే 15 నుంచే విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని కంపెనీలను ఆదేశించారు.

కో–మార్కెటింగ్ విధానంలో కంపెనీలు తమ లోపాలను కప్పిపుచ్చుకుంటూ రైతులను మభ్యపెట్టడాన్ని ప్రభుత్వం సహించదని మంత్రి హెచ్చరించారు. దీనిపై నిర్దిష్ట నియమావళిని రూపొందించాలని, అవసరమైతే కో–మార్కెటింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, హెచ్‌టీ (బి) పత్తి విత్తనాలు రాష్ట్రంలోకి



రాకుండా సరిహద్దుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలన్నారు.

రైతులకు వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం అందించేందుకు 'డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్' ప్రతినిధులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో భేటీ అయ్యారు. సాగుకు ముందే వర్షపాతం వివరాలను ఎస్సెమ్మెస్ (ఏఐ), వాట్సాప్ ద్వారా అందించే పైలట్ ప్రాజెక్ట్ గురించి వారు వివరించారు. దీనివల్ల రైతులు నాట్లు వేయడానికి, కోతలు చేపట్టడానికి సరైన సమయాన్ని నిర్ణయించుకోగలరని తెలిపారు. ఈ ప్రాజెక్టును సమగ్రంగా పరిశీలించి తగిన నిర్ణయం తీసుకోవాలని మంత్రి వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను ఆదేశించారు. ఈ సమావేశాల్లో సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ సెక్రటరీ సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ కుట్ర



- మాజీ సీఎం కేసీఆర్, హరీష్ రావులను ఇరికించేందుకు యత్నం..
- అక్రమ ఆదేశాలు పాటిస్తే అధికారులకు మూల్యం తప్పదు
- బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హెచ్చరిక

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రాజకీయ నాయకులను, ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులను అక్రమంగా ఇరికించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ కేసు విచారణ తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

గతేడాది మార్చిలో నమోదైన ఈ కేసు ధారావాహిక వలే కొనసాగుతోందని, ఇప్పటి వరకు రెండు సార్లు సిట్ (ఎస్ఐటీ) వేసి 350 మంది సాక్షులను విచారించినా ఇంతవరకు చార్జ్ షీట్ దాఖలు చేయలేదని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. కేవలం రాజకీయ కక్ష సాధింపు కోసమే పాత నేరస్థులతో బలవంతంగా నేతలు పేర్లు చెప్పిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1885 ఇండియన్ టెలిగ్రాం చట్టం ప్రకారం ట్యాపింగ్ అనేది అధికారుల పరిధిలోని అంశమని, ఇందులో రాజకీయ నాయకులకు ఎటువంటి సంబంధం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

"అధికారులు రాజకీయ నాయకుల అక్రమ ఆదేశాలను గుడ్డిగా పాటిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా ఇస్రో సైంటిస్ట్ నంబి నారాయణన్ కేసును గుర్తు చేస్తూ.. తప్పుడు కేసులు పెట్టిన కేరళ పోలీసులపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకున్న విషయాన్ని ప్రస్తావించారు. తెలంగాణలో కూడా ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం వంటి కేసుల్లో ఫేక్ ఎవిడెన్స్ సృష్టిస్తే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నిజాలను ప్రజలకు చేరవేస్తున్న 'తెలుగు స్క్రైబ్' వంటి సోషల్ మీడియా సంస్థలపై టెర్రరిస్టుల మీద పెట్టే కేసులు పెట్టడం దుర్మార్గమని విమర్శించారు. మరోవైపు హరీష్ రావు, కేటీఆర్ ఇళ్ల వద్ద ప్రైవేట్ హ్యాకర్లతో నిఘా పెడుతున్నారని ఆరోపించారు. "ప్రభుత్వానికి రాజకీయ కక్ష తీర్చుకోవడంపై ఉన్న శ్రద్ధ.. రైతులపై లేదు. నేడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఢిల్లీలో ధర్నా చేసి అయినా ధాన్యం కొనుగోలు చేయించేవారు. కాంగ్రెస్ పాలనలో రైతులు కన్నీరు పెడుతున్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. అమృత్ టెండర్లలో జరిగిన అవకతవకలపై సిట్ ఎందుకు వేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు దాసరి ఉష, మంద శ్యాం తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘాల రద్దు.. ప్రజాస్వామ్య విరుద్ధం!

- నామినేటెడ్ విధానంపై సహకార ప్రతినిధుల గళం..
- హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్..
- ప్రెస్ క్లబ్‌లో 'టెస్కాబ్' మాజీ చైర్మన్ రవీందర్ రావు వెల్లడి.

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలోని సహకార సంఘాల పాలక వర్గాలను రద్దు చేసి, నామినేటెడ్ కమిటీలను నియమించాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంపై సహకార సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో టెస్కాబ్ (బూజాబాదీ) మాజీ చైర్మన్ కొండూరు రవీందర్ రావుతో పాటు పలువురు ప్రతినిధులు ప్రభుత్వ వైఖరిని ఖండించారు.

ఈ సందర్భంగా రవీందర్ రావు మాట్లాడుతూ.. 597 జీవో ద్వారా పాలక వర్గాలను రద్దు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు. ఈ జీవోను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా, పాత పాలక వర్గాలనే కొనసాగించాలని న్యాయస్థానం స్పష్టమైన తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం కోర్టు ఆదేశాలను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహించడంపై ఆయన ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది రైతు సభ్యులతో, 60 వేల కోట్ల రూపాయల టర్నోవర్‌తో నడిచే సహకార వ్యవస్థను రాజకీయ లబ్ధి కోసం దెబ్బతీయొద్దని వారు కోరారు. ఎక్కడైనా అవకతవకలు జరిగితే చర్యలు తీసుకోవాలి కానీ, మొత్తం వ్యవస్థను రద్దు చేయడం సరికాదన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉండే ఈ వ్యవస్థలో నామినేటెడ్ విధానం తగదని, వెంటనే పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో సహకార వ్యవస్థలో ప్రొఫెషనల్ బ్యాంకర్లకు అవకాశం కల్పించారని, కేసీఆర్ పాలనలో వ్యవస్థ బలోపేతానికి పూర్తి స్వేచ్ఛనిచ్చారని వారు గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే విధంగా సహకార సంఘాల స్వతంత్రతను కాపాడాలని కోరారు. రైతులు పంట కొనుగోళ్లలో ఇబ్బందులు పడుతున్న తరుణంలో, ఎన్నుకోబడిన సభ్యులు రైతులకు అండగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు అశోక్, మంజులా రెడ్డి, వెంకట్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పత్రికా స్వేచ్ఛలో భారత్ బేజారు!

**ప్రపంచ సూచీలో 157వ స్థానానికి పతనం..**
**ఏడాది కాలంలోనే ఆరు స్థానాలు దిగజారుడు..**
**ప్రజాస్వామ్యానికి పొంచి ఉన్న ప్రమాదంపై 'ఆర్ఎస్ఎఫ్' ఆందోళన.**

బలగం టీవీ, హైదరాబాద్

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ నానాటికీ దిగజారిపోతోంది. అంతర్జాతీయ జర్నలిజం వాచ్‌డాగ్ 'రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్' (ఆర్ఎస్ఎఫ్) ఏప్రిల్ 30న విడుదల చేసిన 2026 ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో భారత్ పరిస్థితి దారుణంగా ఉన్నట్లు వెల్లడైంది. మొత్తం 180 దేశాల జాబితాలో భారతదేశం 157వ స్థానానికి పడిపోయింది. గతేడాది (2025) 151వ స్థానంలో ఉన్న భారత్, తాజాగా మరో ఆరు స్థానాలు కిందకు దిగజారడం గమనార్హం.

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛ ఇంత దారుణంగా దెబ్బతినడానికి రాజకీయ జోక్యం, జర్నలిస్టులపై దాడులే ప్రధాన కారణమని ఆర్ఎస్ఎఫ్ తన నివేదికలో పేర్కొంది. మీడియా సంస్థల యాజమాన్యం కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమవ్వడం, మీడియా సంస్థలు రాజకీయ పార్టీల అనుబంధ విభాగాల్లా మారిపోవడం పట్ల నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. జర్నలిస్టులపై నమోదవుతున్న కేసులు, దాడుల వల్ల ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంలో పత్రికా స్వాతంత్ర్యం తీవ్ర సంక్షోభంలో



పడిందని విశ్లేషించింది.

గత 25 ఏళ్ల చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది ప్రపంచ దేశాల సగటు స్కోరు తగ్గిపోయిందని ఆర్ఎస్ఎఫ్ తెలిపింది. వందకు పైగా దేశాల్లో పాత్రికేయ పరిస్థితులు విషమించాయని, సగానికి పైగా దేశాలు 'క్లిష్టమైన' లేదా 'అత్యంత తీవ్రమైన' కేటగిరీలోకి చేరాయని నివేదిక వెల్లడించింది. కేవలం భారత్‌లోనే కాకుండా అమెరికా వంటి దేశాల్లో కూడా ర్యాంకింగ్స్ పడిపోవడం గమనార్హం.

**తొలి ఐదు.. చివరి ఐదు స్థానాలు:**

అగ్రస్థానంలో: నార్వే, నెదర్లాండ్స్, ఎస్టోనియా, డెన్మార్క్, స్వీడన్.

అట్టడుగున: సౌదీ అరేబియా, ఇరాన్, చైనా, నార్త్ కొరియా, ఎరిత్రియా.

జర్నలిస్టుల పట్ల హింస పెరగడం, అణచివేత చర్యల వల్ల పాత్రికేయ వృత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోందని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలకే గొడ్డలిపెట్టు అని ఆర్ఎస్ఎఫ్ హెచ్చరించింది.



## ఆధునిక సాంకేతికతతోనే వ్యవసాయం లాభదాయకం..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక విధానాలను అందిపుచ్చుకుంటూ, మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే సాగు ఖర్చులు తగ్గి రైతులకు ఆశించిన స్థాయిలో అధిక ఆదాయం లభిస్తుందని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ జె. సురేష్, డాక్టర్ ప్రీతికరెడ్డి మరియు మండల వ్యవసాయ అధికారి కె. ప్రణీత హాజరై రైతులకు పలు సూచనలు చేశారు.?ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ, రైతులు సాగులో యూరియా వాడకాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని కోరారు. రసాయన ఎరువులు, పురుగుమందులను విచక్షణారహితంగా వాడటం వల్ల సాగు ఖర్చు పెరగడమే కాకుండా నేల స్వభావం దెబ్బతిని నీరు కూడా కలుషితమవుతుందని హెచ్చరించారు. దీనికి ప్రత్యామ్నాయంగా సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని అన్నారు.

?కేవలం వరి సాగుపైనే ఆధారపడకుండా, రైతులు మారుతున్న కాలానికి అనుగుణంగా పంట మార్పిడి చేపట్టాలని శాస్త్రవేత్తలు సూచించారు. చిరుధాన్యాలైన జొన్న, సజ్జలతో పాటు పప్పుధాన్యాలైన మినుము, పెసర మరియు నూనెగింజల పంటలైన పొద్దుతిరుగుడు, వేరుశనగ, నువ్వులను సాగు చేయడం వల్ల మంచి లాభాలు పొందవచ్చని అన్నారు . ఈ కార్యక్రమంలో బోయినిపల్లి గ్రామ సర్పంచ్ నల్ల మోహన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, ఏఈఓ శ్రీదేవి, వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థులు అనిల్, శ్రీధర్ మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## జూన్ నాటికి వ్యవసాయ కనెక్షన్లన్నీ పూర్తి..

**- ఎస్.ఈ. వేణు మాధవ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసినట్లు సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్.ఈ.) టి. వేణు మాధవ్ ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా వేణు మాధవ్ మాట్లాడుతూ, గడిచిన నెల రోజుల్లోనే రికార్డు స్థాయిలో 860 సర్వీసులను మంజూరు చేశామని అన్నారు . గత ఆర్థిక సంవత్సరం మొత్తం 1752 సర్వీసులు మాత్రమే మంజూరు కాగా, ఈ ఏడాది కేవలం ఏప్రిల్ నెలలోనే 860 కనెక్షన్లు ఇవ్వడం గమనార్హమన్నారు.

?ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 1540 వ్యవసాయ సర్వీసులను కూడా జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, ఇతర సామగ్రి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. రైతులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అర్హులైన ప్రతి రైతుకు సత్వరమే విద్యుత్ కనెక్షన్ అందజేస్తామని పేర్కొన్నారు.



## మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లికి చౌడలమ్మ ప్రతిష్ట ఆహ్వానం అందజేత

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

ఇల్లంతకుంట మండలంలోని వెలిజిపూరం గ్రామంలో ఘనంగా నిర్వహించనున్న చౌడలమ్మ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రిక ను గ్రామ సర్పంచ్ నాయిని నవీన్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ నాయకులు మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి ని మర్యాద పూర్వకంగా కలిసి అందజేశారు.చౌడలమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామస్తులు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమం లో కంకణాల రాంప్రసాద్ రెడ్డి, గొల్ల కోమటి శంకర్, స్వామి రెడ్డి, శ్రీనివాస్, రాజయ్య, చంద్రయ్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు



## గాలిపల్లి పెద్దమ్మ తల్లి బోనాల జాతర లో మాజి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి

**బలగం, టీవీ ఇల్లంతకుంట**

మానకొండూర్ నియోజకవర్గ మాజి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ ఇల్లంతకుంట మండలం గాలిపెల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి బోనాల జాతర లో పాల్గొని కొబ్బరికాయ కొట్టి మొక్కు చెల్లించుకున్నారు ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ బద్దం శేఖర్ రెడ్డి ,పెద్దమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు రసమయి ఘనంగా సన్మానించారు. అనంతరం ఇల్లంతకుంట మండల కేంద్రంలో పలు వివాహ కార్యక్రమాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా జెడ్పి మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు , సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఒల్లాల ప్రభాకర్ గౌడ్ మాజీ పిఎసిఎస్ వైస్ చైర్మన్ గొడుగు తిరుపతి, దేవేందర్ రెడ్డి,ఇల్లంతకుంట మండల సర్పంచ్ ల ఫోరమ్ మాజి ఉపాధ్యక్షులు, అనంతారం మాజి సర్పంచ్ బొల్లం వెంకటేశం,పెద్దలింగపూర్ మాజి సర్పంచ్ గొడిశెల జితేందర్ గౌడ్, వొళ్ళాల రవీందర్ గౌడ్, ర్యాగటి రమేష్,శ్రీనివాస్,ఎడ్ల ప్రశాంత్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, కిషన్, నరేష్, రవీందర్ రెడ్డి, పిల్లి వేణు,వరుకోలు సంతోష్, పొన్నాల తిరుపతి, ముత్యం, నంది రాజు, ఓర్పుల రాములు, శేఖర్,మాజీ ప్రజా ప్రతినిధులు, బి ఆర్ ఎస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థిని మందాడి హానికి ఘన సన్మానం..

**బలగం టీవీ, ఇల్లంతకుంట :**




రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన మందాడి హని పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచి, సొసైటీ స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించింది. ఈ విశిష్ట విజయాన్ని గుర్తిస్తూ, హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ మందాడి హని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, మందాడి హని సాధించిన ఈ విజయం ఎంతో గర్వకారణమని, ఇది ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు . గురుకుల విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తూ, ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకుని వాటిని చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం అన్ని రకాల వసతులను కల్పిస్తోందని, విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సొసైటీ స్థాయిలో ప్రతిభ చాటిన హనిని చూసి పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

# పర్యాటక కేంద్రంగా నాంపల్లి లక్ష్మీనరసింహ స్వామి సన్నిధి



**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**

వేములవాడ మున్సిపల్ పరిధిలో ఉన్న నాంపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి సన్నిధిని ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు . మంగళవారం సుమారు 2 కోట్ల 69 లక్షల రూపాయలతో నాంపల్లి చెరువు బండ్ సుందరీకరణ పనులకు మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ తో కలిసి ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు . అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, రాజన్న దర్శనార్థం వచ్చే భక్తులు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా నాంపల్లి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా పర్యాటకులకు అన్ని రకాల వసతులు కల్పిస్తూ, వేములవాడ క్షేత్రానికి ఇదొక ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా పనులు వేగవంతం చేస్తామని అన్నారు . కేవలం నాంపల్లి అభివృద్ధి మాత్రమే కాకుండా, రాజన్న ఆలయ పునర్నిర్మాణం కోసం ఇప్పటికే 150 కోట్లు కేటాయించామని, పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలకు మరో 16 కోట్లు, గుడి చెరువు కాలుష్య నివారణకు 10 కోట్లు వెచ్చిస్తున్నామని అన్నారు .

రాష్ట్రవ్యాప్తంగా కబ్జాకు గురైన చెరువులను, కుంటలను కాపాడటమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో మూసి నది ప్రక్షాళనతో పాటు పట్టణాల్లోని జలవనరుల పునరుద్ధరణకు కంకణం కట్టుకున్నామని, గతంలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలను తిరిగి స్వాధీనం చేసుకుని ప్రజలకు అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు . హైదరాబాద్‌లోని బతుకమ్మ కుంట మాదిరిగానే, నాంపల్లి చెరువును కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది పర్యాటకులను ఆకట్టుకుంటామని అన్నారు . వేములవాడ పట్టణ సర్వతోముఖాభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని అన్నారు .

### నాంపల్లి గుట్టపై కన్నుల పండువగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన విప్ ఆది శ్రీనివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం నాంపల్లి గుట్టపై వెలిసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఉదయం నుంచే నాంపల్లి గుట్ట భక్తుల జయజయధ్వానాలతో మార్మోగిపోయింది. ఆలయాన్ని రంగురంగుల పూలమాలలు, విద్యుత్ దీపాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. అర్చకుల వేద మంత్రోచ్ఛారణల మధ్య, సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామివారి కల్యాణ తంతును శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఈ ఆధ్యాత్మిక వేడుకలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని,రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అంతకుముందు ఆలయ ఈవో రమాదేవి ఆయనకు ఘనస్వాగతం పలికి, ఆలయ మర్యాదలతో దర్శన ఏర్పాట్లు చేశారు. కల్యాణానంతరం వేద పండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందించి, శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ: ఆధ్యాత్మిక క్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, నాంపల్లి గుట్టను భక్తులకు మరింత సౌకర్యవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు.ఎండ తీవ్రత దృష్ట్యా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులను, సిబ్బందిని అభినందించారు.



# ప్రమాదాల రహిత సమాజమే ఎన్పీడీసీఎల్ లక్ష్యం..



**-మే 1 నుంచే విద్యుత్ భద్రతా వారోత్సవాలు..**

**-సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**

ఎన్పీడీసీఎల్ పరిధిలో మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలను నిర్వహించనున్నట్లు సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు . గురువారం రాజన్న సిరిసిల్ల సర్కిల్ పరిధిలోని ఎస్ఈ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి పాల్గొని, భద్రతా అవగాహన పోస్టర్లు మరియు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, సంస్థ పరిధిలోని 18 సర్కిళ్లలో ప్రజలకు, రైతులకు విద్యుత్ భద్రతపై విస్తృత అవగాహన కల్పించడమే ఈ వారోత్సవాల ప్రధాన ఉద్దేశమని అన్నారు.విద్యుత్ ప్రమాదాలను సున్నా స్థాయికి తీసుకురావాలన్నదే తమ అంతిమ లక్ష్యమని అన్నారు . క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తును అందించాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలు చాలావరకు మానవ తప్పిదాల వల్ల, అంటే అజాగ్రత్త, నిర్లక్ష్యం మరియు కనీస అవగాహన లేకపోవడం వల్లనే జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా అమూల్యమైన ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు.పొలాల్లో లేదా వీధుల్లో విద్యుత్ తీగలు తెగిపడితే వాటిని తాకకుండా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఇళ్లలో తడి చేతులతో స్విచ్‌లు వేయడం, నాసిరకం వైర్లను వాడటం వంటి పనుల వల్ల ప్రమాదాలు పొంచి ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా గృహాల్లో బట్టలు ఆరవేసేందుకు ఇనుప తీగలకు బదులు ప్లాస్టిక్ తీగలను వాడాలని, ఏసీ కంప్రెషర్ల వద్ద గాలి ధారాళంగా వీచేలా చూసుకోవాలని, ఫ్యాన్లకు రబ్బరు గుండు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ మోటార్ల వద్ద సరైన ఇన్సులేషన్ మరియు ఎర్తింగ్ సౌకర్యం ఉండేలా రైతులు జాగ్రత్త వహించాలని అన్నారు .

?ఈ వారోత్సవాల్లో భాగంగా ప్రతి గ్రామం మరియు పట్టణంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యపరుస్తామని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లను సరిచేయడం, వంగిన స్తంభాలను తొలగించడం, తక్కువ ఎత్తులో ఉన్న తీగలను ఎత్తు పెంచడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నామని అన్నారు . విద్యుత్ భద్రత అనేది కేవలం శాఖ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించినప్పుడే ప్రమాదాలను నివారించగలమని పేర్కొన్నారు. ఏదైనా విద్యుత్ సమస్య తలెత్తితే 24 గంటలు అందుబాటులో ఉండే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు వేణు మాధవ్, శ్రీకాంత్, డివిజనల్ ఇంజనీర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర..

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**



ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు తమ పంటలకు సరైన మద్దతు ధర లభిస్తుందని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు . తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని ధాన్యం కుప్పలు, రైతులకు కల్పించిన వసతులను ఆమె దగ్గరుండి చూశారు. కేంద్రంలో టార్పాలిన్లు, గన్ని సంచులు, తాగునీరు మరియు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యం వివరాలు, సన్న రకం వడ్ల రాక మరియు రైస్ మిల్లుల కేటాయింపు ప్రక్రియపై అధికారులతో సమీక్షించారు.

అనంతరం కలెక్టర్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులు తప్పనిసరిగా ప్యాడీ క్లీనర్లను ఉపయోగించాలని సూచించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరించాలని అధికారులను ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన మిల్లులకు మాత్రమే పంపాలని, కొనుగోలు ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా సాగాలని అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు బోనస్ అందిస్తోందని, ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు మరియు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని అన్నారు.

సిద్దిపేట జిల్లా నర్మెట్ట వద్ద ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని ,దీనివల్ల ఆయిల్ పామ్ పండించే రైతులకు విక్రయ సమస్యలు ఉండవని, మంచి లాభాలు వస్తాయని తెలిపారు. రైతులు సన్న రకం వడ్లు మరియు ఆయిల్ పామ్ సాగు వైపు మొగ్గు చూపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, సహకార అధికారి రామకృష్ణ, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ్ ప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాల్లో బోయినిపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రభంజనం..

**-విద్యార్థులకు ఘన సత్కారం**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి ఫలితాల్లో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. బుధవారం విడుదలైన ఫలితాల్లో ఈ పాఠశాల వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభ చాటిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు భూమయ్య మరియు ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు.

పాఠశాల స్థాయిలో 549 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన మెరుపుల వెన్నెల, 544 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచిన బొడ్డు శివకార్తిక్, మరియు 542 మార్కులతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్న రాజ్ కుమార్‌లను పూలమాలలు, బొకేలతో అభినందించారు. విద్యార్థుల కృషిని ప్రోత్సహిస్తూ మొదటి మరియు రెండు స్థానాల్లో నిలిచిన వారికి ప్రధానోపాధ్యాయులు నగదు పారితోషికాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భూమయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల కష్టానికి, ఉపాధ్యాయుల బోధనకు ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు . ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు.





## కాంగ్రెస్ ప్రభుత్వమే పేదల పక్షపాతి

**-కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు**

**-శ్రీగాథలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం**

**బలగం టీవీ, గంభీరావుపేట**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక పాలనతో ప్రజల మన్ననలు పొందుతోందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు. గురువారం శ్రీగాథ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరై, లబ్ధిదారులకు సారె అందజేశారు. ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ, పైరవీలకు తావులేకుండా అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఇప్పటికే మొదటి విడతలో 4.50 లక్షల ఇండ్లు మంజూరు కాగా, త్వరలో రెండో విడతలో మరో 4 లక్షల ఇళ్లను ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ వంటి హామీలను ఇప్పటికే నెరవేర్చామని, త్వరలోనే లక్ష మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని అన్నారు. లబ్ధిదారులు సుద్దాల అనిత గణేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బందెల రాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు వేముల శ్రీనివాస్ గౌడ్, నాయకులు పర్శ శ్రీనివాస్, గౌరినేని శ్రావణ్ రావు,వేముల యాద గౌడ్, కత్తుల బాబు, పర్శ నరసింహులు, సుద్దాల గణేష్, సుద్దాల అనిత, సుద్దాల బుచ్చమ్మ,సుద్దాల మల్లేశం, సుద్దాల అజయ్, సుద్దాల రాము తదితరులు పాల్గొన్నారు.

# ఉస్మానియా ఆస్పత్రిలో అరుదైన చికిత్స..

- 18 నెలల బాలునికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్..
- 10 కిలోల బరువున్న చిన్నారికి.. 240 గ్రాముల లివర్ అమర్చిన వైద్యులు..
- 14 గంటల పాటు చికిత్స
- వైద్యులను అభినందించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ..

బలగం టీవి, హైదరాబాద్

ఉస్మానియా జనరల్ ఆస్పత్రి డాక్టర్లు మరోసారి తమ సత్తా చాటుకున్నారు. గ్లైకోజెన్ స్టోరేజ్ అనే అరుదైన డిసీజ్‌తో బాధపడుతున్న 18 నెలల చిన్నారికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ శస్త్రచికిత్స విజయవంతంగా చేశారు. కేవలం 10 కిలోల బరువు ఉన్న బాలునికి.. సుమారు 14 గంటల పాటు శ్రమించి 240 గ్రాముల లివర్ అమర్చారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యం నిలకడగా ఉందని శస్త్ర చికిత్స బందానికి నేతత్వం వహించిన డాక్టర్ మధుసూదన్ వెల్లడించారు.

హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ ఇర్ఫాన్, సాజియా దంపతుల 18 నెలల కుమారుడు అఫన్.. గత కొంతకాలంగా తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పిల్లాడు తరచుగా ఆకలితో ఏడుస్తుండడం, మత్తుగా ఉండటం, పొట్ట ఉబ్బరం వంటి లక్షణాలతో బాలున్ని తల్లిదండ్రులు ఉస్మానియా హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. డాక్టర్లు ఆ బాలున్ని పరీక్షించి, అవసరమైన వైద్య పరీక్షలు చేయించారు. రక్తంలో షుగర్ లెవల్స్ చాలా తక్కువగా ఉండడం, కొవ్వు పదార్థాలు అధికంగా ఉండటం, కాలేయం అసాధారణంగా విస్తరించి ఉండడాన్ని డాక్టర్లు గుర్తించారు. బాలుని సమస్యపై మరింత లోతుగా అధ్యయనం చేసి, అతను గ్లైకోజెన్ స్టోరేజ్ ( టైప్-క్ష్మక్ష్మక్ష్మ) అనే అరుదైన



వ్యాధితో బాధపడుతున్నట్టుగా నిర్ధారించారు.

ఈ వ్యాధి శరీరంలో గ్లైకోజెన్‌ను గ్లూకోజ్‌గా మార్చే ఎంజైమ్ లోపంతో ఏర్పడుతుందని, దీని కారణంగా శరీరంలో నిల్వ ఉన్న శక్తిని వినియోగించుకోలేకపోవడం, తరచూ హైపోగ్లైసీమియా, కాలేయం పెద్దగా అవడం, కండరాల బలహీనత వంటి సమస్యలు తలెత్తుతాయని డాక్టర్ మధుసూదన్ తెలిపారు. దీర్ఘకాలంలో గుండె, మెదడు, కండరాలపై కూడా ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందన్నారు.

చిన్నారికి అప్పటికే వ్యాధి ముదిరి, పరిస్థితి విషమంగా మారడంతో లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని డాక్టర్లు నిర్ణయించారు. చిన్నారి తండ్రి నుంచి లివర్‌లోని కొంత భాగాన్ని సేకరించి, బాలుడికి అమర్చారు. డాక్టర్ మధుసూదన్ నేతత్వంలోని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగానికి చెందిన వైద్యుల బందం సుమారు 14 గంటల పాటు ఈ క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించి, బాబుకు పునర్జన్మను ప్రసాదించారు. శస్త్రచికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఇప్పటివరకు ఎలాంటి సంక్లిష్టతలు లేకుండా కోలుకుంటున్నాడని డా. మధుసూదన్ వెల్లడించారు.

కార్పొరేట్ హాస్పిటల్స్‌లో సుమారు రూ.50 లక్షల వరకూ చార్జ్ చేసే ఈ సర్జరీని ప్రభుత్వ సహకారంతో రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేశామని ఉస్మానియా సూపరింటెండెంట్, డాక్టర్ రాకేశ్ సహాయ్ తెలిపారు. ట్రాన్స్‌ప్లాంటేషన్ అనంతరం అవసరమైన మందులను కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. దేశంలో ప్రభుత్వ హాస్పిటల్స్‌లో ఇలాంటి శస్త్రచికిత్సలు చాలా అరుదుగా జరుగుతాయని, ముఖ్యంగా గ్లైకోజెన్ స్టోరేజ్ డిసీజ్ వంటి అరుదైన వ్యాధులకు లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ నిర్వహించడం వైద్య రంగంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని డాక్టర్లు తెలిపారు.

మంత్రి అభినందనలు

కేవలం 10 కిలోల బరువున్న చిన్నారికి అత్యంత అరుదైన శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడిన ఉస్మానియా డాక్టర్ల బందాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో పనిచేస్తున్న డాక్టర్ల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించారని మంత్రి కొనియాడారు. ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తున్న వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా లక్షల మంది పేషెంట్లకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయని మంత్రి గుర్తు చేశారు.

# నేటి నుంచి సనత్‌నగర్ టిమ్స్‌లో ట్రయల్ రన్

- నెల రోజుల పాటు 22 విభాగాల్లో ఓపీ సేవలు
- అధికారులకు మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల

బలగం టీవి, హైదరాబాద్

సనత్‌నగర్‌లోని తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ప్రారంభానికి రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి టిమ్స్‌లో ట్రయల్ రన్ నిర్వహించేందుకు ఆరోగ్యశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ట్రయల్ రన్ సుమారు నెల రోజుల పాటు కొనసాగనుండగా, ఈ కాలంలో రోజూ ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అవుట్ పేషెంట్ (ఓపీ), డయాగ్నస్టిక్ సేవలు అందుబాటులో ఉండనున్నాయి. ప్రజలకు వైద్యసేవల అందుబాటు, సిబ్బంది పనితీరు, విభాగాల సమన్వయాన్ని పరీక్షించే లక్ష్యంతో ఈ ట్రయల్ రన్ చేపడుతున్నారు.

కార్డియాలజీ, న్యూరాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీసహ మొత్తం 22 విభాగాల్లో సేవలు అందించనున్నారు. ఇందుకోసం అవసరమైన వైద్యులు, పారా మెడికల్ సిబ్బందిని ఇప్పటికే నియమించినట్లు అధికారులు తెలిపారు. టిమ్స్‌ను పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, ట్రయల్ రన్ అనంతరం సేవలను మరింత విస్తరించే దిశగా చర్యలు చేపట్టనున్నట్లు ఆరోగ్యశాఖ వర్గాలు పేర్కొన్నాయి. రాష్ట్ర ప్రజలకు ఆధునిక వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో టిమ్స్ కీలక కేంద్రంగా మారనుందని ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేస్తోంది.



# మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

సీఐటీయూ పిలుపు.

బలగం, బోయినిపల్లి;

మండల కేంద్రంలో జరిగే మేడే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రములో హమాలి కార్మికుల ఆధ్వర్యంలో సిఐటియు పక్షాన మేడే కరపత్రం విడుదల చేశారు. మే,ఒకటో తేదీన మండల కేంద్రంలో జరిగే మేడే,జెండా కార్యక్రమానికి అన్ని రంగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా సిఐటియు పక్షాన కార్మిక వర్గానికి పిలుపునివ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి గురిజాల శ్రీధర్, హమాలీ సంఘం అధ్యక్షులు, కార్యదర్శి, మరియు హమాలి కార్మికులు పాల్గొన్నారు.

# పాఠశాలలను నిరంతరం తనిఖీ చేయాలి

- బోధనలో కృత్రిమ మేధస్సు వినియోగించాలి
- కార్పొరేట్ తరహా ఫలితాలు రావాలి :
- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల
- విద్యాశాఖ పనితీరుపై కలెక్టరేట్‌లో సమగ్ర సమీక్ష

బలగం టీవి, హైదరాబాద్

జిల్లాలోని విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యాశాఖ పనితీరుపై ఆమె సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల పనితీరుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

విద్యాశాఖ అధికారులు, ఉప విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను నిరంతరం తనిఖీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పర్యవేక్షణలో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి పక్షం రోజులకు ఒకసారి (ఫోర్ట్‌నైట్) విద్యాశాఖ ప్రగతిపై సమీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల హాజరు శాతం వందకు వంద శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా వసతులు కల్పిస్తున్నామని, ఆ మేరకు ఫలితాల్లోనూ గొప్ప మార్పు రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. బోధనలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు(ఏఐ) వినియోగాన్ని ప్రోత్సహించాలని





సూచించారు. అవసరమైన చోట తరగతి గదుల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలని, సమగ్ర శిక్షా అభియాన్ కార్యక్రమాన్ని జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.

జిల్లాలో 800 పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. 57,387 మంది విద్యార్థులకు అందుతున్న ఈ భోజనంలో నాణ్యత పాటించాలని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని స్పష్టం చేశారు. విద్యార్థుల చదువులో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంచేందుకు తరచుగా 'పేరెంట్స్ కమిటీ' సమావేశాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.జిల్లాలో మొత్తం 2,886 పాఠశాలలు ఉండగా, వాటిలో 9,53,850 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్టు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఉపాధ్యాయుల సంఖ్య, ఖాళీలు, హాజరు శాతం, పరీక్ష ఫలితాల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.రోహిణి, డీఈవో కార్యాలయ ఏడీ శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ ఈవోలు, సెక్టోరియల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.



# సెస్ నుండి ఎన్పీడీసీఎల్ లోకి కలిపినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు

- మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్

బలగం, బోయినిపల్లి;

సిరిసిల్ల విద్యుత్ సెస్ నుండి ఎన్పీడీసీఎల్ లోకి కలిపినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని మాజీ జెడ్పిటిసి పులి లక్ష్మీపతి గౌడ్ అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ: 1970లో సిరిసిల్ల ఏరియా మెట్ట ప్రాంతం కావడంతో అప్పటి ఎమ్మెల్యే రాజేశ్వరరావు సిరిసిల్ల ప్రాంతంలోని రైతులకు మంచి నాణ్యమైన విద్యుత్ ను అందించాలనే లక్ష్యంతో సెస్ సంస్థను ఏర్పాటు చేయగా, రైతులకు మంచి విద్యుత్ అందిస్తూ లాభదాయకంలో ఉండగా, ప్రస్తుతం గత కొన్ని సంవత్సరాల నుండి సెస్ లో ఉన్న పాలకులు ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ సెస్ ను నష్టాల బాటలోకి నెట్టారని అన్నారు. మద్యమానేర్ జలాశయంలో కొన్ని గ్రామాలు మునిగిపోగా అక్కడ తొలగించిన సామాగ్రికి లెక్కలు లేకుండా చేసి, గత ప్రభుత్వ పాలన అధికారులు అమ్ముకున్నారని మండిపడ్డారు. సెస్ లో జరుగుతున్న అవినీతిని గ్రహించి, కాంగ్రెస్ ప్రభుత్వం సెస్ ను ఎన్పీడీసీఎల్ లోకి కలిపి రైతులకు మేలు చేయాలని చూడడం అభినందనీయమని అన్నారు. ఎన్పీడీసీఎల్ లోకి మార్చడంతో రైతులు వినియోగదారులు ఎలాంటి ఇబ్బందు లేకుండా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలాసాగర్ సర్పంచ్ ఏనుగుల కనకయ్య,నాయకులు పిట్టల రమేష్ లు ఉన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా భవనాలు నిర్మిస్తే కఠిన చర్యలు



- ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్

రోడ్డుపైకి భవన నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కష్ణా రెడ్డి వివరించారు. 99 రోజుల కార్యాచరణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం అల్వాల్ లోతుకుంట, గోల్నాక, రాజీవ్ నగర్, అల్వాల్ చెరువును అధికారులు సిబ్బందితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అల్వాల్ లోతుకుంటలో కొంతమంది భవన యజమానులు రోడ్డుపైకి ర్యాంపులు నిర్మించడం, రహదారి స్థలాన్ని ఆక్రమించినట్లు కమిషనర్ గమనించారు. సంబంధిత అధికారులకు తక్షణమే అన్ని రహదారి ఆక్రమణలను తొలగించి, సెట్ బ్యాక్ క్లియర్ చేసి, ప్రజల వినియోగానికి రోడ్డును పునరుద్ధరించాలని ఆదేశించారు. అలాగే ఆ ప్రాంతంలోని వాణిజ్య సంస్థల ట్రేడ్ లైసెన్సులను సమీక్షించి, ట్రేడ్ లైసెన్స్ అమలు, ధవీకరణపై సిబ్బంది సమర్థంగా పని చేయాలని సూచించారు. రహదారులు, ప్రజా రవాణాకు అడ్డుగా ఉన్న చిన్నచిన్న దుకాణాల ఆక్రమణలను కూడా తొలగించాలని ఆదేశించారు. అలాగే గోల్నాక ప్రాంతంలో జరుగుతున్న సమ్మర్ క్యాంప్ కార్యక్రమాలను సమీక్షించి, పిల్లల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలు, ఏర్పాట్లను పరిశీలించారు. రోడ్డు పక్కన ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలు చెట్ల వ్యర్థాలు పేరుకుపోయిన విషయాన్ని గమనించి, సంబంధిత సిబ్బందిని వెంటనే తొలగించి పరిశుభ్రతను కాపాడాలని ఆదేశించారు. కాలనీలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌ను కూడా సందర్శించి, వద్దులకు అందిస్తున్న సౌకర్యాలను సమీక్షించారు.

వీటితో పాటు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించి నిర్వహణ పరిశుభ్రత, ఆహార సేవలను పరిశీలించారు. మహిళా సాధికారతకు, ప్రజలకు చౌకైన ఆహారం అందించడంలో మహిళా శక్తి క్యాంటీన్ పాత్రను అభినందించారు. అనంతరం ఆల్వాల్ చెరువు పరిసర ప్రాంతాలు, సమీప నాళాల్లో దోమల లార్వా పెరుగుదలకు అనుకూలమైన అనేక ప్రదేశాలు ఉన్నట్లు గుర్తించారు. దోమల పెరుగుదలను నియంత్రించేందుకు ఫాగింగ్‌ను పెంచడం, నాళాల డిసిల్టింగ్ చేయడం, యాంటీ లార్వల్ ట్రీట్మెంట్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు, కాలానుగుణ వ్యాధులను నివారించేందుకు సమన్వయంతో కూడిన చర్యలు, నిరంతర పర్యవేక్షణ చాలా అవసరమని కమిషనర్ స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీ, డీఈ, ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు, రాంకీ ప్రతినిధులు, ఈపీఆర్‌టీఐ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆట స్థలాలను ఖరీదుగా మార్చి క్రీడా స్ఫూర్తిని దెబ్బతీస్తారా?

- ప్లే గ్రౌండ్స్ లో భారీగా పెంచిన యూజర్ చార్జీలను రద్దు చేయాలి
- అర్బన్ డెవలప్ మెంట్ ఫోరం (యు డి ఎఫ్) కన్వీనర్ ఏం.శ్రీనివాస్ డిమాండ్

బలగం టీవి, హైదరాబాద్



గ్రేటర్ హైదరాబాద్ లోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో 700లకు పైగా ఉన్న మున్సిపల్ ప్లేగ్రౌండ్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లలో యూజర్ చార్జీలను 300 శాతం పెంచుతూ మున్సిపల్ కార్పొరేషన్‌లు తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని అర్బన్ డెవలప్ మెంట్ ఫోరం (యు డి ఎఫ్) కన్వీనర్ ఏం.శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ప్లే గ్రౌండ్స్‌ను ప్రజలకు ఉచితంగా అందుబాటులో ఉంచి విద్యార్థులు, యువతీ, యువకులను క్రీడల పట్ల ప్రోత్సాహాన్ని అందించాల్సిన అధికార యంత్రాంగం, ఆట స్థలాలను ఖరీదుగా మార్చడం క్రీడా స్ఫూర్తిని పూర్తిగా దెబ్బతీయటమే అవుతుందన్నారు. ఆట స్థలాలను వాడుకునే వారికి అథ్లెటిక్స్ నుండి వివిధ క్రీడలకు నెలవారీఫీజు 50 రూపాయలు ఉండగా 200 రూపాయలకు పెంచారన్నారు. కొన్నింటికి 200 నుంచి 400 కు పెంచారని, ఇక ఆట స్థలాలను బుక్ చేసుకునే పాఠశాలలకు పదివేల నుండి 15 వేలకు పెంచారని తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధి(క్యూర్)లో అంతర్జాతీయ స్థాయిలో క్రీడా ప్రమాణాలను అభివద్ధి చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నిధులు పెంచకుండా ఆటగాళ్ల మీదనే భారం మోపడం సమంజసమా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆట స్థలాల్లో కూడా డబ్బులు చెల్లించి ఆటాడుకోవాల్సిందేనా? అని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అనేక ఆట స్థలాల నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టారని, ఇప్పుడేమో యూజర్ చార్జీలను భారీగా పెంచారన్నారు. ఇవి క్రీడలను వ్యాపారంగా మార్చడమేనన్నారు. పెంచిన యూజర్ చార్జీలను తక్షణమే రద్దు చేయాలని, ఆట స్థలాల అభివద్ధికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వమే కేటాయించాలని డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్స్‌గా మార్చాలి

- అసమానతలు లేని శాస్త్రీయ విద్యా విధానం అమలు చేయాలి
- ప్రైవేటు విద్యా వ్యవస్థ రద్దు చేయాలని టీపీటీఎఫ్ డిమాండ్

బలగం టీవి, హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలుగా అభివృద్ధి చేసి, అసమానతలు లేని కామన్ స్కూల్ ఆధారిత శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రైవేటు విద్యా వ్యవస్థను రద్దు చేసి అందరికీ సమానమైన, నాణ్యమైన ఉచిత విద్య అందించాల్సిన అవసరం ఉందన్నారు.

బాగ్లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "కామన్ స్కూల్ విద్యా విధానం -- శాస్త్రీయ విద్య అమలు, ప్రైవేట్ స్కూళ్ల రద్దు" ఎజెండాతో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చకినాల అనిల్ కుమార్ మాట్లాడుతూ సమాజంలోని అసమానతలను నిర్మూలించడంలో విద్య కీలక పాత్ర పోషించాలన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే శాస్త్రీయ విద్యను ప్రభుత్వం ఉచితంగా అందించేందుకు విద్యా విధానాలను రూపొందించాలని కోరారు.

ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ నివేదికలో సామాజిక, మానవీయ దృక్పథంతో కూడిన విద్యా సిఫార్సులు కనిపించలేదని ఆయన విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన సమాన, నాణ్యమైన ఉచిత విద్య లక్ష్యాలకు విరుద్ధంగా ఉన్న అభ్యంతరకర అంశాలను తొలగించాలని డిమాండ్ చేశారు. స్పష్టత లేని నూతన విద్యా విధానాన్ని విద్యార్థులపై రుద్దకుండా, ముందుగా ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులతో విస్తృత చర్చలు జరపాలని





సూచించారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి మాట్లాడుతూ కామన్ స్కూల్ వ్యవస్థ సాధన కోసం విద్యా ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా విద్యా వ్యవస్థ పరిరక్షణ, ప్రభుత్వ బడుల బలోపేతం ప్రభుత్వాల ప్రాధాన్య అంశాలుగా మారేందుకు ప్రజా ఒత్తిడి పెరగాలన్నారు. ఏఐఎఫ్ ఆర్‌టీఈ అధ్యక్ష వర్గ సభ్యులు ప్రొఫెసర్ జి. హరగోపాల్ మాట్లాడుతూ విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ ధోరణులను తీవ్రంగా వ్యతిరేకించారు. విద్యలో లౌకిక, ప్రజాస్వామిక విలువలను దెబ్బతీసే ప్రయత్నాలను అడ్డుకోవడానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాస్వామికవాదులు విశాల ప్రజా ఉద్యమంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంఎల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం మాట్లాడుతూ ప్రభుత్వ విద్య ప్రస్తుతం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, ప్రభుత్వ విద్యా పరిరక్షణ కోసం ప్రగతిశీల సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ, ఏపిటిఎఫ్ పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకుడు పి. నాగిరెడ్డి, అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎం. ప్రకాష్ రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి పెద్దఎత్తున టీపీటీఎఫ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు హాజరయ్యారు.

# ప్రియాంక చోప్రా హెయిర్‌కేర్ బ్రాండ్ 'అనామలీ'ను సొంతం చేసుకున్న రిలయన్స్ రిటైల్

## బ్యూటీ పోర్ట్‌ఫోలియో విస్తరణలో రిలయన్స్‌కు కీలక అడుగు

బలగం టీవి, హైదరాబాద్

భారత రిటైల్ రంగ దిగ్గజం రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ (ఆర్‌ఆర్ఎల్) తన బ్యూటీ విభాగాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మరో కీలక ముందడుగు వేసింది. గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా జోనస్ స్థాపించిన ప్రముఖ హెయిర్‌కేర్ బ్రాండ్ 'అనామలీ'ను రిలయన్స్ రిటైల్ కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం ద్వారా 'అనామలీ' ట్రేడ్‌మార్కులు, బ్రాండ్ ఆస్తులు, డిజిటల్ హక్కులు రిలయన్స్ సొంతమయ్యాయి.

2021లో ప్రారంభమైన 'అనామలీ' క్లీన్, వీగన్, అందుబాటు ధరల హెయిర్‌కేర్ ఉత్పత్తులతో అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. ఈ కొనుగోలు ద్వారా రిలయన్స్ తన విస్తృత రిటైల్ నెట్‌వర్క్‌తో పాటు 'టిరా' వంటి ఆమ్నీఛానల్ వేదికల ద్వారా ఈ బ్రాండ్‌ను మరింత మంది వినియోగదారులకు చేరువ చేయనుంది.

రిలయన్స్ రిటైల్ వెంచర్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఈషా అంబానీ మాట్లాడుతూ, బ్యూటీ బ్రాండ్ల విస్తరణలో ఇది వ్యూహాత్మక నిర్ణయమని తెలిపారు. 'అనామలీ'కి ఉన్న ప్రపంచ స్థాయి గుర్తింపు, నాణ్యత, అందుబాటు ధరలు ఈ బ్రాండ్‌ను మరింత ఆకర్షణీయంగా మార్చాయని పేర్కొన్నారు. ప్రియాంక చోప్రాతో కలిసి భారత మార్కెట్‌లో ఈ బ్రాండ్‌ను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు.

ఈ ఒప్పందం ప్రకారం ప్రియాంక చోప్రా బ్రాండ్‌కు క్రియేటివ్ డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'అనామలీ' ప్రస్థానంలో ఇది కీలక మలుపని, రిలయన్స్ భాగస్వామ్యంతో భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా బ్రాండ్ విస్తరణకు మరింత బలం చేకూరుతుందని తెలిపారు. ఈషా అంబానీతో కలిసి పనిచేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

భారత మార్కెట్‌తో పాటు ఉత్తర అమెరికా, యూకే, మధ్యప్రాచ్య దేశాల్లోనూ 'అనామలీ' విస్తరణ కొనసాగనున్నట్లు సంస్థ వెల్లడించింది. రిలయన్స్ ఈ కొనుగోలుతో భారత బ్యూటీ, పర్సనల్ కేర్ రంగంలో తన ప్రాభవాన్ని మరింత విస్తరించనున్నట్లు మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# భోగిలో...కందుల సులోచనగా అనుపమ




టాలీవుడ్ నటుడు శర్వానంద్ కథానాయకుడిగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి' . ప్రస్తుతం ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుడగా తాజాగా ఈ సినిమా నుంచి కథానాయిక అనుపమ పరమేశ్వరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ సినిమాలో అనుపమ కందుల సులోచనా రాణి అనే గ్రామీణ యువతిగా కనిపించబోతుంది. చేతిలో క్యారేజీ, మోదుగ ఆకులు పట్టుకుని ఉన్న పోస్టర్ ప్రస్తుతం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. 1960ల నాటి తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో ఈ సినిమా సాగబోతున్నట్లు సమాచారం. సంపత్ నంది దర్శకత్వంలో వస్తున్న ఈ హై-వోల్టేజ్ డ్రామాలో శర్వానంద్ ఊరమాస్ అవతారంలో కనిపిస్తుండగా, అనుపమ పరమేశ్వరన్ మరియు డింపుల్ హయాతీ ఫీమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 28, 2026 న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయడానికి చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

# మెడికల్ మాఫియా బాగోతంపై దూత-2



ఓటీటీ ప్రపంచంలో డార్క్, రియలిస్టిక్ కథనాలకు పెరుగుతున్న ఆదరణ మధ్య దూత సీజన్ 2పై ఆసక్తి రోజురోజుకీ పెరుగుతోంది. మొదటి సీజన్ జర్నలిజం బ్యాక్‌డ్రాప్‌లో సస్పెన్స్, హారర్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా ఈ సిరీస్, ఇప్పుడు పూర్తిగా కొత్త జానర్ వైపు మలుపు తిరగడం హాట్ టాపిక్‌గా మారింది. ఈసారి మేకర్స్ మెడికల్ మాఫియా వంటి సున్నితమైన అంశాన్ని ఎంచుకోవడం విశేషం. ఆరోగ్య రంగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు, మాఫియా నెట్వర్క్‌ను రియలిస్టిక్‌గా చూపించే ప్రయత్నం చేస్తున్నట్టు సమాచారం. దీంతో సిరీస్ మరింత డార్క్, గ్రిప్పింగ్ నేరేషన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉంది. ఈ మార్పు వెనుక ప్రధాన బలం దర్శకుడు విక్రమ్ కె. కుమార్ విజన్ అని చెప్పాలి. థ్రిల్లర్ కథనాల్లో తన ప్రత్యేక శైలిని నిరూపించుకున్న ఆయన, సీజన్ 1లో జర్నలిజం ప్రపంచంలోని అంధకార కోణాలను చూపించినట్లే, ఈసారి మెడికల్ రంగంలోని లోపాలను షాకింగ్ ఎలిమెంట్స్‌తో తెరపైకి తీసుకురానున్నారు. ప్రస్తుతం ఓటిటి ప్లాట్‌ఫార్మ్‌లలో ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్స్‌కు భారీ డిమాండ్ ఉంది. రియలిస్టిక్, డార్క్ కంటెంట్‌కు ప్రేక్షకులు ఎక్కువగా ఆకర్షితులవుతున్న నేపథ్యంలో, 'దూత 2' కూడా అదే ట్రెండ్‌ను క్యాష్ చేసుకునేలా రూపొందుతోంది. 'దూత' మొదటి సీజన్ మంచి రెస్పాన్స్ అందుకోవడంతో, రెండో సీజన్‌పై అంచనాలు సహజంగానే పెరిగాయి. ఈ సిరీస్‌లో ప్రధాన పాత్రలో నాగ చైతన్య నటించడం మరో ప్లస్ పాయింట్. ఆయన స్టార్ ఇమేజ్, కథలోని తీవ్రత కలిసి ప్రేక్షకులకు మరింత ఇంటెన్స్ అనుభూతిని అందించే అవకాశముంది.

# ఓటిటిలోకి బైకర్ విడుదల



టాలీవుడ్ యంగ్ హీరో శర్వానంద్ నటించిన లేటెస్ట్ స్పోర్ట్స్ డ్రామా 'బైకర్' ఓటీటీలోకి రాబోతుంది. భారతదేశంలోనే మొట్టమొదటి మోటోక్రాస్ రేసింగ్ నేపథ్యంతో తెరకెక్కిన ఈ చిత్రం, థియేటర్లలో విడుదలైన నెల రోజుల్లోనే డిజిటల్ ప్రేక్షకులను పలకరించబోతోంది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు దక్కించుకుంది. దీంతో ఈ చిత్రం మే 1 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ఇది అందుబాటులోకి రానుంది. ఇక హిందీలో ఈ సినిమాను 'శర్వా' అనే టైటిల్‌తో విడుదల చేస్తున్నారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ కథానాయికగా నటించగా, సీనియర్ నటుడు రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. ఒక ప్రొఫెషనల్ బైక్ రేసర్ తన కెరీర్‌లో ఎదుర్కొనే సవాళ్లు, తండ్రి ఆశయాల కోసం అతను చేసే పోరాటాన్ని ఈ సినిమాలో అద్భుతంగా చూపించారు. థియేటర్లలో మిశ్రమ స్పందన లభించినప్పటికీ, రేసింగ్ సీక్వెన్స్ మరియు టెక్నికల్ వాల్యూస్ పరంగా సినిమాకు మంచి ప్రశంసలు దక్కాయి.

# అగధలో మంజుల మనవరాలు జోవిక



ప్రముఖ సీనియర్ దర్శక నిర్మాత ఎమ్మెస్ రాజు ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న మిస్టికల్ డివైన్ థ్రిల్లర్ 'అగధ'. హారర్ జానర్‌లో రాబో తున్న ఈ చిత్రం నుంచి తాజాగా ఆసక్తికరమైన అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా ద్వారా తమిళ నటి వనితా విజయ్ కుమార్ కుమార్తె, అలనాటి మంజుల మనవరాలు జోవిక విజయ్ కుమార్ టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. చిత్రంలో ఆమె 'హరిణి' అనే పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, దీనికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో ఆమెను ఒక తీవ్రమైన శక్తిగా అభివర్ణించారు మేకర్స్. శ్రీ ఆదివరాహ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బాలుసు నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రావణ్ రెడ్డి 'సింహ'గా, కామాక్షి భాస్కర్ల 'మహాదేవి'గా నటిస్తుండగా, ఉల్కా గుప్తా, షిజు అబ్దుల్ రషీద్ వంటి తారలు కీలక పాత్రలు పోషిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం మరియు హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ సినిమాకు సుమారు 45 నిమిషాల పాటు సాగే భారీ వీఎఫ్‌ఎక్స్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉన్న ఈ చిత్రానికి రాకేష్ వెంకటాపురం సంగీతాన్ని అందిస్తుండగా, నాని చమిడిశెట్టి ఛాయాగ్రహణం, జునైద్ సిద్ధిఖీ ఎడిటింగ్ మరియు రాజీవ్ నాయర్ ప్రొడక్షన్ డిజైనింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# దృశ్యం-3 టీజర్ విడుదల




మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్రైమ్ థ్రిల్లర్ సిరీస్ 'దృశ్యం 3' టీజర్ ఎట్టకేలకు విడుదలైంది. బుధవారం సాయంత్రం విడుదలైన ఈ టీజర్ సోషల్ మీడియాను ఊపేస్తోంది. ఈ వీడియోలో గత రెండు భాగాలకు సంబంధించిన కీలక ఘట్టాలను గుర్తు చేస్తూనే, మూడో భాగంపై భారీ అంచనాలను పెంచేశారు దర్శకుడు జీతూ జోసెఫ్. గతంలో తన కుటుంబాన్ని రక్షించుకోవడానికి అత్యంత ధైర్యంగా, ప్రశాంతంగా ఎత్తుగడలు వేసిన జార్జ్ కుట్టీ, ఈసారి మాత్రం తీవ్రమైన భయంలో కనిపిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'ఇప్పుడు నాకు భయంగా ఉంది సార్.. నన్ను ఇంకెవరో గమనిస్తున్నారని అనిపిస్తోంది' అంటూ మోహన్‌లాల్ చెప్పే డైలాగ్ ఈసారి కథలో ఏదో పెద్ద ప్రమాదం పొంచి ఉందని సూచిస్తోంది. ఈ టీజర్‌లో మీనా, అన్సిబా, ఎస్తేర్ అనిల్ తో పాటు ఆశా శరత్ వంటి పాత పాత్రలన్నీ కనిపించి సందడి చేశాయి. ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మోహన్‌లాల్ పుట్టినరోజైన మే 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయాలని చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. ఈ మూడవ భాగంతోనే సెన్సేషనల్ సిరీస్‌కు ముగింపు పలకనున్నట్లు తెలుస్తోంది. ఇక మలయాళ టీజర్ రావడంతో తెలుగులో విక్టరీ వెంకటేష్ నటించే రీమేక్ ఎప్పుడుంటుందా అని టాలీవుడ్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతానికి తెలుగు రీమేక్‌పై ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ, మలయాళ వెర్షన్ విడుదలైన తర్వాత అక్కడ వచ్చే స్పందనను బట్టి రీమేక్ పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# ప్రళయ్ మూవీ పనుల్లో రణ్‌వీర్ బిజీ




'ధురంధర్ 2' విజయంతో ఫుల్ జోష్‌లో ఉన్నారు నటుడు రణ్‌వీర్ సింగ్. ఈ సినిమా హిట్ తర్వాత గతంలో అంగీకరించిన కొన్ని సినిమాల నుంచి ఆయన వైదొలుగుతున్నారంటూ వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో 'ప్రళయ్' టీమ్ స్పందించింది. ఆయన ఈ సినిమా నుంచి వైదొలగలేదని స్పష్టం చేసింది.రణ్‌వీర్ సింగ్ హీరోగా జై మెహతా తెరకెక్కిస్తున్న చిత్రమిది. వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చినట్లు కూడా ఇటీవల ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో టీమ్ స్పందిస్తూ.. 'రణ్‌వీర్, జై ఇద్దరూ 'ప్రళయ్' సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. నిరంతరం చర్చలు జరుపుతూ స్క్రిప్ట్‌ను లాక్ చేశారు. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయి. భారతీయ సినిమాలో ఇప్పటివరకు చూడని ఓ భారీ అద్భుతాన్ని తెరపై ఆవిష్కరించేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది. ఆగస్టులో 'ప్రళయ్' షూటింగ్ ప్రారంభమవుతుంది' అని వెల్లడించింది. దీనికోసం హిందీ చిత్రాలలో మునుపెన్నడూ చూడనివిధంగా ఓ ప్రపంచాన్ని నిర్మించనున్నామని చిత్రబృందం తెలిపింది. ఇక 'ప్రళయ్' విషయానికి వస్తే.. ప్రముఖ బాలీవుడ్ నిర్మాత హన్సల్ మెహతా కుమారుడు జై మెహతా ఈ చిత్రంతో వెండితెరకు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గతంలో ఆయన 'స్కామ్ 1992', 'లూటేరే' వంటి వెబ్‌సిరీస్‌లకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేశారు. ఇక, రణ్‌వీర్ 'డాన్ 3' నుంచి వైదొలిగినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చిన విషయం